గత కొన్ని రోజుల నుండి అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురు గాలులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, ఉత్తర భారతంలోనూ రైతాంగానికి తీరని నష్టాలను మిగిల్చాయి. ఇవి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఆహార ధాన్యాలు, ఉద్యానవన పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. తెలంగాణలో దాదాపు 4.10లక్షల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతినగా, ఆంధ్రప్రదేశ్‌లో 2.50లక్షల ఎకరాల్లో నీటి పాలయ్యాయి. సాధారణంగా రబీ (యాసంగి) సీజనులో ఈదురు గాలులు, అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయి. అధికారులు మాత్రం తెలంగాణలో 2,22,250 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అంచనావేశారు. తెలంగాణలోని భూపాపల్లి, గద్వాల, సంగారెడ్డి, రంగారెడ్డి, కొత్తగూడెం, నల్లగొండ, కొత్తగూడెం, నాగరకర్నూల్, మెదక్, ఖమ్మం, తదితర జిల్లాల్లో వివిధ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా దాదాపు 6 లక్షల ఎకరాల్లోని వరి, మిర్చి, మామిడి, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ, పప్పుశెనగ, నిమ్మ, బొప్పాయి, ఉల్లి, టమాటా, బీరకాయ వంటి కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నట్లు అంచనా. కల్లాలు, పొలాలు, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆరుబయట ఆర బెట్టిన ఎండు మిర్చి, మొక్కజొన్న, వేరుశెనగ, పప్పుశనగ తడిసి ముద్దయ్యాయి. మామిడి చెట్లు విరిగిపడగా, పిందెలు, కాయలు రాలిపోయాయి. పొట్లదశలో ఉన్న వరి, మొక్కజొన్న చేలు నేలవాలాయి. కొత్తగూడెం జిల్లాలో గోదావరి వెంట కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట అంతా నీటిపాలయ్యాయి. రోళ్లగడ్డ, చింతలపాడు, లక్ష్మీపురం, నర్సాపురం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లోని మొక్కజొన్న నేలకొరిగింది. చండ్రుగొండ, దమ్మపేట్, అశ్వారావుపేట్, ఇల్లెందు ప్రాంతాల్లో మామిడి తోటలు ధ్వసం అయ్యాయి. చెట్లకొమ్మలు విరిగి పడ్డాయి, మామిడి పిందెలు, కాయలు రాలిపోయాయి. భూపాలపల్లి జిల్లాలోని కసింపల్లి తదితర ప్రాంతాల్లో కల్లాల్లో ఎండబోసిన మిర్చి పూర్తిగా నీట కొట్టుకుపోయింది. గద్వాల జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అమ్మకానికి ఉంచిన వేరుశెనగ సంచులు తడిసిపోయాయి. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి తెచ్చిన పప్పుశెనగ, ధాన్యం బస్తాలు నీటిమునిగాయి. మానవపాడు మండలంలో మిర్చి రైతులు ఆగమాగం అయ్యారు. నాగర్ కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం మహదేవునిపేట్ పరిధిలోని కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న పూర్తిగా తడిసిపోయాయి. హైదరాబాద్ నగరానికి నిత్యం కూరగాలు సరఫరా చేసే సంగారెడ్డి, వికారాబాద్, మెదక్ తదితర జిల్లాల్లోని పంటలు దెబ్బతిని అన్నదాతలకు అపార నష్టం మిగిల్చింది. సంగారెడ్డి జిల్లాలో వడగండ్ల వానభీభత్సం సృష్టించడంతో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఈ జిల్లాల్లో దాదాపు 1,500 ఎకరాల్లో ఉల్లి, 700 ఎకరాల్లో కూరగాయలు, 350 ఎకరాల్లో మామిడి,



50 ఎకరాల్లో బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. వీటితో పాటు, వరి, మిర్చి, పుచ్చ, నిమ్మ, బత్తాయి, నిమ్మ తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని జహీరాబాద్, కోహీర్, రాయికోడ్, న్యాల్‌కల్, మునిపల్లి, వట్‌పల్లి తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, శెనగ, చెరుకు పంటలు దెబ్బతిన్నాయి. వికారాబాద్ జిల్లాలో 1,200 ఎకరాల్లో ఉల్లి పంట పూర్తిగా దెబ్బతినగా, 70శాతం మేర కూరగాయల తోటలకు నష్టం వాటిల్లింది. నాలుగు రోజుల్లో కోతకు రానున్న తర్బూజ పంట వడగండ్ల వానతో మొత్తం ధ్వంసమైంది. రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో వడగండ్ల వాన, భారీ వర్షాలతో మిర్చి పంటలు, ఆరబెట్టిన మిరపకాయలు నీటిపాలయ్యాయి. మామిడి కాయలు రాలిపోగా, చెట్లు విరిగిపడ్డాయి. గద్వాల జిల్లాలో దంచి కొట్టిన వర్షం, వడగండ్ల వానలతో వ్యవసాయ మార్కెట్ యార్డులో దాదాపు 140క్వింటాళ్ల వరకూ వేరుశెనగ కొట్టుకు పోయింది. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని పప్పు శెనగలు తడిసిపోయాయి. మల్లకల్ మానవపాడు అలంపూర్ మండలాల్లోని రైతులు తమ కల్లాల దగ్గర ఎండబెట్టిన ఎండుమిర్చి పూర్తిగాతడిసిపోయింది. బిజినేపల్లి మండలం మహదేవునిపేట్ గ్రామంలో వర్షాలతో ఆరు బయట ఆరబెట్టిన మక్కలు, ధాన్యం మొత్తం నీటిపాలయ్యాయి. గద్వాల జిల్లాలో పొగాకు దోరణాలు వానకు తడిసిముద్దయ్యాయి. వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట్ మండలంలో 600ఎకరాల్లో కూరగాయ పంటలు, వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న, వరిపంటలు దెబ్బతిన్నాయి. మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లో మామిడి చెట్లు నేలకొరిగాయి, అలాగే ఉల్లి, బొప్పాయి వంటి ఉద్యానపంటలు, మొక్కజొన్న చేలకు నష్టం వాటిల్లింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన అన్నదాతల కష్టాన్ని అకాల వర్షాలు తుడిచిపెట్టేశాయి. రాష్ట్రంలోని 16జిల్లాల్లో వర్షాలు, వడగళ్ల వానలు తీవ్ర ప్రభావం చూపాయి. దాదాపు 2.50లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిందని, మొత్తంగా 450 కోట్ల రూపాయలకు పైనే రైతులు నష్టపోయారు. మొక్కజొన్న పంట భారీగా దెబ్బతింది. కొన్ని జిల్లాల్లో ఖరీఫ్ సీజన్‌లో నూర్చిన ధాన్యం వానలకు తడిసిపోగా, రబీలో సాగుచేసిన వరి చేతికందేదశలో వర్షం కురవడంతో గింజ రాలిపోతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో తోట్లవల్లూరు, ఉంగుటూరు, గూడూరు తదితర మండలాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. రంగు మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక రబీలో వేసిన వరి, జొన్న, మొక్కజొన్న చేలు పడిపోయాయి. సుమారు 50వేల ఎకరాల్లో రెండో పంటగా వేసిన మినుము పనలపై ఉండగా తడిసింది. ఎకరానికి దాదాపు 13వేల రూపాయల వరకూ నష్టంవస్తుంది. ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి తదితర మండలాల్లో వర్జీనియా పొగాకు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మొక్కజొన్న, జొన్న పాలు పోసుకునేదశలో తడిసిపోయాయి. కాకినాడ జిల్లాలో వరి, మొక్కజొన్నతో పాటు, నువ్వు చేలు నీట పాలయ్యాయి. నెల్లూరు జిల్లాలో 9 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. అనంతపురం జిల్లాలో 8,100 ఎకరాల్లో వరి, జొన్న, కొర్ర, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. ప్రకాశం జిల్లాలో పత్తి, మిరప, పొగాకు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు నష్టంవాటిల్లింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 24 వేల ఎకరాలకు పైగా పంట నీటిపాలైంది. వైఎస్సార్ అన్నమయ్యజిల్లాల్లో 3వేల ఎకరాల్లో, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొక్కజొన్న, లంక పొగాకు, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. మరోపక్క ఈ అకాల వర్షాలతో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందేలా కనిపించడం లేదు. పంటనష్టం వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు మొత్తం పంటలో 33శాతం కంటే అధికంగా నష్టం జరిగితేనే పరిహారం అందుతుందని చెప్పడం గమనార్హం. అంతకంటే తక్కువ శాతం పంట దెబ్బ తింటే నష్టం వాటిల్లినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ క్రాప్ నమోదైన వెంటనే పంటలను అధికారులు పరిశీలిస్తున్నారు. వివిధ కారణాలతో ఈ క్రాప్ నమోదు కాని రైతులకు పరిహారం అందే పరిస్థితి లేదు. ప్రతీ ఏటా విపత్తుల కారణంగా గాలిలో దీపా లవుతున్న రైతుల జీవితాలకు బీమా కల్పించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో వర్తింప చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా కాని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్నట్లు ప్రత్యేక బీమాపథకాన్ని అయినా తెలంగాణలో అమలు చేయడంద్వారా పంటలకు పరిహారం ద్వారా రైతులను ఆదుకునేవీలుంటుంది. అదేవిధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోరైతులు తక్కువ కాలపరిమితిలో చేతికి వచ్చే వంగడాలను ప్రధానంగా వరి పంటను సాగుచేయాలనేది వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటుండగా, ఆదిశగా రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ విఫలమవుతోంది. కేఎన్ఎం 118 వంటి వరి వంగడాలను యాసంగిలో సాగుచేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. 125 రోజుల్లో వరి పంట చేతికి వస్తే అకాల వర్షాలు రాక ముందే పంట కోత దశకు చేరుకుంటుంది. అయితే వీటిపై అంతగా అవగాహన లేని రైతులు రబీ పంటల నాట్లను ఆలస్యంగా నాటడంతో పాటు, దీర్ఘకాలిక రకాలను సాగు చేస్తుండటంతో అకాల వర్షాల బారిన పడుతున్నారు. ●

# కన్నడ కదనం..

కర్ణాటక

**ఎ.వి.వి ప్రసాద్**

వాహోరీ పోరుకు తెర లేచింది. ఇప్పుడు దేశంలో అందరిదృష్టి కర్ణాటకపైనే. గతవారం ఎన్నికల సంఘం కన్నడ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూలును ప్రకటించడంతో అన్ని పార్టీలు ఒక్కసారిగా కదనరంగంలోకి దుకాయి. అవి ఎదురు చూస్తున్నది కూడా ఇసి నుంచి రావలసిన ఆ ప్రకటన కోసమే. మే నెలలో కర్ణాటక ఎన్నికలు జరుగు తాయని బిజెపి అధిష్టానం పలు సందర్భాలలో అంటున్నప్పటికి, ప్రధాని కర్ణాటక పర్యటనలు ఇటీవల ముమ్మరం చేసినప్పటికి, కచ్చితమైన తేదీలు తెలియక పార్టీలు డోలాయమానంలో ఉన్నాయి. ఇప్పుడు ఇసి తాంబూలాలిచ్చేయడంతో ఇక తన్నుకోవలసిన అవసరం పార్టీలపై పడింది. అయితే బిజెపి తిరిగి అధికారంలోకి రాగలదా? లేక కాంగ్రెస్ అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోగలుగుతుందా? అన్నదే ప్రధాన ప్రశ్న. ఎన్ని పార్టీలు బరిలోకి దిగినా, ప్రధానమైన పోటీ ఈ రెండు పార్టీల మధ్యనే కనిపిస్తోంది. మరో ముఖ్యమైన పార్టీ జెడి(ఎస్) కూడా ఉన్నా, దాని ప్రభావం అంతంత మాత్రమేనని పరిశీలకులు అంటున్నారు. జెడిఎస్ నేత, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామికి కూడా తిరిగి అధికారం చేపట్టాలనే కాంక్ష ఉన్నా, అందుకు ఉపయోగించే పరిస్థితులు ఆయనకు పరిమితంగానే కనిపిస్తున్నాయి. ఏదో మేజిక్ జరిగితేనే ఆయనను సిఎం పదవి వరించవచ్చు. ఏవిధంగానైనా అధికారం నిలబెట్టుకోవాలని బిజెపి ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ అందుకే తమ పోరును ఉధృతం చేశాయి. ఎవరిది గెలుపు? ఈ ప్రశ్న సమాధానం చివరికి ఓటరు తీర్పుపైనే ఆధారపడి ఉన్నా, పార్టీల తీరును బట్టి ముందుగా కొంత అంచనా వేయవచ్చు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపికి దానిని నిలబెట్టుకోవలసిన అవసరం చాలా ఉంది. ఏ కారణంగానైనా విఫలమైతే, అతి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు దక్షిణాదిని చేజార్చుకున్నట్లవుతుంది. దక్షిణాదిలో ఒక్క కర్ణాటకలోనే ఆ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. మిగిలిన నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో బిజెపి పరిస్థితి అంతంత మాత్రమే. కుదిరితే కొన్ని సీట్లు పెంచుకోగలదు కానీ హఠాత్తుగా అధికారంలోకి వచ్చే అవకాశాలు మిగిలిన నాలుగు రాష్ట్రాలలో చాలా తక్కువ. ఈ పరిస్థితిలో కర్ణాటకలో అధికారాన్ని నిలబెట్టుకోవడం ఆపార్టీకి చాలా అవసరం. దక్షిణాదిలో ఎక్కడా అధికారంలో లేకపోతే, లోక్‌సభ ఎన్నికలపై దానిప్రభావం తప్పక పడుతుందనిపిస్తుంది. బసవరాజ్ బొమ్మయ్ నాయకత్వంలోని ప్రస్తుత బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు బలంగానే వీస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. రిజర్వేషన్ల విధానం విషయంలో బొమ్మయ్ ప్రభుత్వం ఇటీవల తీసుకొన్న కొన్ని చర్యల ప్రభావం కూడా అసెంబ్లీ ఎన్నికలపై పడుతుందనే చెప్పాలి.



కర్ణాటక

4శాతం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేయడం, లింగాయత్, వక్కళిగలకు సమానంగా పంచడం ఇటీవల చాలా వివాదాస్పదమైంది. ఓబిసి కోటాలో ముస్లింలకు లభిస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దుచేస్తూ ఓ పది రోజుల క్రితమే ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఆ నాలుగు శాతాన్ని బిజెపికి గట్టిఓటు బ్యాంకులైన లింగాయత్‌లు, వక్కళిగలకు సమానంగా పంచడంపై ప్రస్తుతం దుమారం చెలరేగుతోంది. మతప్రాతిపదికపై రిజర్వేషన్లు హేతుబద్ధం కాదనేవాదం సమంజసమే అయినా, ఎన్నికలు సమీపిస్తున్నవేళ తీసుకొన్న నిర్ణయం కావడంతో ఎన్నికలపై దాని ప్రభావం కూడా కనిపించే అవకాశం ఉంది. ముస్లింల నుంచి తీసివేసిన రిజర్వేషన్‌లను పంచడంతో వక్కళగలకు 4 నుంచి 6 శాతానికి, లింగాయత్‌లకు 5నుంచి ఏడు శాతానికి రిజర్వేషన్లు పెరిగాయి. రాష్ట్రంలోని 224 అసెంబ్లీ సీట్లలో 100 సీట్లుపైగా లింగాయత్‌ల ప్రాబల్యం ఉండడంతో ఈ కొత్త రిజర్వేషన్ల విధానం బిజెపికి అనుకూలించ వచ్చని ఆ పార్టీనేతలు చెబు తున్నా, మిగిలిన వర్గాలలో ఉన్న అసంతృప్తి ప్రతి కూల ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. ఈ రిజర్వేషన్ల విధానాన్ని తనకు అనుకూలంగా ఉపయోగించుకొన డానికి కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలు ప్రారంభించింది. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్ల పాతవిధానాన్ని పునరుద్ధరిస్తామంటూ కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు జాతీయ అధ్యక్షుడుగా ఉన్న మల్లికార్జున ఖర్గే సొంతరాష్ట్రం కర్ణాటక కావడంతో ఇక్కడ తమ పార్టీని గెలుపించుకోవలసిన బాధ్యత ఆయనపై ఎక్కువగా ఉందనే చెప్పాలి. ఎందుకంటే ఇక్కడ కాంగ్రెస్ ఈసారి అధికారంలోకి రాలేకపోతే, సార్వత్రిక ఎన్నికలలో దాని ప్రభావం తప్పకపడుతుంది. ప్రస్తుతం దక్షిణాదిలో కాంగ్రెస్ ఎక్కడా అధికారంలోలేదు. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రలో కూడా పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఏమాత్రమైనా అవకాశం ఉంటే అది కర్ణాటకలోనే. ఎన్నికల షెడ్యూలును ఇసి ప్రకటించడానికి ముందు కాంగ్రెస్ 124 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించడాన్ని బట్టిచూస్తే విజయంపై ఆపార్టీ ఎటువంటి ఆశలతో ఉన్నదో అర్థమవుతుంది. ప్రస్తుత అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 75సీట్లు ఉండగా, మరో ముఖ్యపార్టీ జెడిఎస్‌కు 28 మాత్రమేఉన్నాయి. ఆ పార్టీకి మైసూరు, మరికొన్ని ప్రాంతాలలో మాత్రమే ఆధిక్యత ఉండడంతో, అధికారంలోకి రావాలంటే బిజెపి, కాంగ్రెస్ కంటె చాలా ఎక్కువ కష్టపడవలసి ఉంటుంది. దేశంలో బలమైన ప్రత్యా మ్నాయంగా ఎదుగుతున్న ఆప్ కూడా కర్ణాటక బరిలోకి దిగుతుండడంతో పోటీ మరింత ఆసక్తిదాయకంగా మారుతుందనే అనిపిస్తుంది. అయితే బలా బాలాలు తేల్చుకోవాలని బరిలోకి దిగుతున్న పార్టీ బిజెపి, కాంగ్రెస్ కావడంతో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో చూడాలి. ఆ రెండు పార్టీలకు ఈ ఎన్నికలు చావో, రేవో తేల్చుకోవలసిన పరిస్థితిని తెచ్చాయనే చెప్పాలి. ●

# 'లైంగిక'ఉచ్చులో డొనాల్డ్‌ట్రంప్!

అమెరికా

**గన్ని మోహన్**

అమెరికా ఆవిర్భవించిన 235 సంవత్సరాల చరిత్రలో మొదటిసారి ఒక మాజీ అధ్యక్షుడు లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పైగా ఆయన ఈ కేసులో కోర్టుకు కూడా హాజరయ్యేంతగా ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు రిపబ్లికన్ నేత డొనాల్డ్‌ట్రంప్‌పై ఈ అభియోగాలు నమోదయ్యాయి. 2016 ఎన్నికల సమయంలో తనతో లైంగికవాంఛలు తీర్చుకున్న ట్రంప్ ఈ సమాచారం బయటపెట్టకుండా ఉండేందుకుగాను తనకు 1.30 లక్షల డాలర్లు చెల్లించారని ఆమె స్వీయకథనం వెలువరించడంతో ఈ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. అంతేకాకుండా పోర్న్‌స్టార్‌తో ఒప్పందం కూడా ట్రంప్‌తరపు న్యాయవాదులు చేసుకున్నారని చెప్పిన ఆమె ఈ ఒప్పందాన్ని రద్దుచేయాలని కోరుతూ రెండేళ్లక్రితమే అమెరికా కోర్టులో దావావేసింది. అధ్యక్ష పదవిలో ఉండటంతో ఆనాడు కేసు నమోదు చేసిన దర్యాప్తు సంస్థలు విచారణచేపట్టాయి. విచారణకేవలం ఆయన చేసిన చెల్లింపులపైనే జరగడం గమనార్హం. స్టోమీ డేనియల్స్ అనే పోర్న్‌స్టార్ వేసిన ఈ దావా ఇపుడు ట్రంప్‌కు రానున్న అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిబంధకంగా మారుతోంది. ఈసంబంధం బయటపడకుండా ఉండేందుకే తనతో అనైతిక ఒప్పందం చేసుకున్నారని ఆమె వాదిస్తోంది. ఈకేసుకు సంబంధించి ఇపుడు ట్రంప్ లొంగిపోతారా లేకఆయన్ను అరెస్టుచేస్తారా మరే విధంగా అయినా కోర్టు విచారణతో సరిపెడతారా అన్నది తేలాల్సి ఉంది. అధ్యక్షపదవిలో ఉండగానే రిపబ్లికన్ నేతగా రెండుసార్లు అభిశంసన తీర్మానం, యుఎస్ పార్లమెంటు భవనంపై దాడిఘటన అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో ఉన్నపుడు కీలకమైన పత్రాలను ధ్వంసం చేసారన్న ఆరోపణలు మాజీ అధ్యక్షుడిపై ఉన్నాయి. ఈ కేసులో ట్రంప్ స్వయంగా లొంగిపోవాలనుకుంటే వెసులుబాటును కల్పించేందుకు మన్హట్టన్ జిల్లా అటార్నీ కూడా ఆయన తరపు న్యాయవాదులతో చర్చలు జరిపింది. మాజీ అధ్యక్షుడిని అరెస్టుచేయడానికి నిర్దిష్టమైన ప్రోటోకాల్ పాటిస్తారు. ఫ్లోరిడాలోని మార్‌ఎలాగో వద్ద ఉన్న తన ఇంటినుంచి ట్రంప్ న్యూయార్క్ సిటీకోర్టుకు రావాల్సి ఉంటుంది. ఆయన ఫోటోలు, వేలిముద్రలు తీసుకుంటారు. కేసు నమోదైతే జడ్జిని ఎంపికచేస్తారు. నిందితుడి విచారణ సమయం, ప్రయాణ ఆంక్షలు, బెయిల్ వంటివి తర్వాత వెల్లడిస్తారు. అయితే ట్రంప్‌గోప్యత కాపాడేందుకు ప్రైవేటు మార్గంలోకూడా కోర్టుకు హాజరయ్యే విధంగా అనుమతించవచ్చు. నిజంగా ట్రంప్ ఈ శృంగారంలో పాల్గొన్నారా లేక ఆయన్ను బ్లాక్‌మెయిల్‌చేసేందుకు ఈ పోర్న్‌స్టార్ ఇలా ప్రకటిస్తున్నదా అన్నది ఇపుడు నిర్ధారణ కావాల్సి ఉంది.



డొనాల్డ్‌ట్రంప్

ఫుల్ డిస్‌క్లోజర్‌పేరిట ఆమె రాసుకున్న స్వీయచరిత్రలోనే ఆమె ఈ విషయాలను స్పష్టంగా పొందుపరిచింది. 2006లో నెవాడా గోల్ఫ్ కోర్స్‌లో తాము కలుసుకున్నామని అక్కడే ఇరువురూ కలిసి ఒక పోర్న్‌స్టూడియో బూత్‌లో ఫోటోలకు ఫోజులిచ్చినట్లు కూడా ఆమె చెపుతోంది. ట్రంప్‌కి 60ఏళ్ల వయసులో 27ఏళ్ల తనతో శృంగారంలో పాల్గొన్నట్లు నిస్సిగ్గుగా వెల్లడించింది. ఈ ఆరోపణలన్నింటినీ ట్రంప్ కొట్టిపారేసారు. డెమొక్రాట్లు తనను అడ్డుకునేందుకే ఈ విధమైన దాడికి దిగారని, 2024 అధ్యక్ష ఎన్నికల్లో తనకు గెలుపు ఖాయం అన్న సమాచారంతోనే డెమొక్రాట్లు తనను అప్రతిష్టపాలుచేసి తద్వారా రాజకీయ లబ్ధిపొందేందుకు ఇలాంటి కార్యాచరణలకు దిగుతున్నారని కూడా ఆయన వెల్లడించారు. అయితే ఏది ఎలాఉన్నా ఇపుడు న్యాయస్థానమే ఆయన అభియోగాలపై విచారణ చేస్తున్నపుడు ఆయన ఇపుడు స్వయంగా కోర్టుకు హాజరుకావాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. అయితే ట్రంప్‌కు ఈ కేసుపరంగా రిపబ్లికన్ల నుంచి భారీమద్దతు లభిస్తోంది. ట్రంప్‌పై ఆరోపణలు చేసిన ఈమె అసలుపేరు స్టెఫానీ క్లిఫర్డ్. 1979లో లూసియానాలో జన్మించిన ఆమె అనేక అడల్ట్ సినిమాల్లో నటించింది. తర్వాత డైరెక్టర్, రచయితగా కూడా మారారు. అసలు ఈ పోర్న్‌స్టార్ ఎవరు ఆమెకు ట్రంప్‌తో ఉన్న సంబంధం ఏమిటి? నిజంగా కలయిక జరిగిందా? ఆనాటి ట్రంప్ సెక్యూరిటీ అధికారులకు ఈ సమాచారం తెలియదా? ఒకవేళ అభియోగాలు విచారణవరకూ వస్తేట్రంప్ అరెస్టు అయినపక్షంలో ఆయన రాజకీయభవిష్యత్తుపై చెరగని మచ్చపడుతుంది. సుప్రసిద్ధ వ్యాపార సామ్రాజ్యంనుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి అమెరికాఫస్ట్ నినాదంతో అధికార పగ్గాలు చేపట్టిన ట్రంప్ తన హయాంలో వివాదాల మార్గంలోనే పయనించాల్సి వచ్చింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌తో మూడు పర్యాయాలుభేటీ కావడం అయినా చర్చలు సఫలం కాకపోవడం, అఫ్ఘానిస్థాన్ నుంచి సంకీర్ణ సేనలను ఉపసంహారింపచేయడం వంటి నిర్ణయాలు కొంత ఆయనకు చేటుతెచ్చాయి. ఆయన వ్యక్తిగత జీవితంలోకూడా ఈ పోర్న్‌స్టార్ ఆరోపణలు కొంత సమస్యలు తెచ్చాయన్నది నిర్వివాదాంశం. తనను మరోవారంలో అరెస్టు చేయవచ్చని స్వయంగా ట్రంప్ ప్రకటించిన అంశాన్ని ఇపుడు డెమొక్రాట్లు లేవనెత్తుతూ తన ప్రమేయంలేని పక్షంలో అరెస్టుకు భయం దేనికి అన్న కొత్తవాదం తెరపైకి తెచ్చారు. ఏనాడో 2006లో జరిగిందని చెపుతున్న ఈ సంఘటనను ఇపుడు కొత్తగా తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఇది ఖచ్చితంగా డెమొక్రాట్లపనేనని చెపుతున్న రిపబ్లికన్లు ఇపుడు ట్రంప్‌ను ఈ కేసు నుంచి బయటపడేసే మార్గాలు అన్వేషించడంలో ఇపుడు తలమునకలవుతున్నారు. ట్రంప్ మాత్రం రాజకీయంగాను, న్యాయపరంగానూ పోరాడతామని చెపుతున్నారు. మొత్తంగా చూస్తే అమెరికా చరిత్రలో మొట్టమొదటిసారి ఒక మాజీ అధ్యక్షుడు లైంగిక ఆరోపణలపై కోర్టు విచారణ వరకూ వచ్చిన మొట్టమొదటి నేతగా డొనాల్డ్ ట్రంప్ నిలిచారన్నది నిర్వివాదాంశం. ●

# మహిళలపై హింసను అరికట్టడంలో సఖివన్‌స్టాప్ సెంటర్లు!



డాక్టర్ నీలం సంపత్

రెండువేల పన్నెండువ సంవత్సరంలో దేశ రాజధాని ఢిల్లీ మహానగరం నడిబొడ్డున జరిగిన నిర్భయపై జరిగిన సామూహిక లైంగిక దాడి, అమానవీయ హత్యను నిరసిస్తూ యావత్ దేశంలో నిరసనలు వెల్లువెత్తడంతోపాటు ప్రపంచ మీడియా సైతం సదరు హేయమైన గ్యాంగ్ రేప్‌పై తీవ్ర ఆందోళనను ప్రకటించింది. మహిళలపై మళ్లీ అలాంటి హేయమైన లైంగిక దాడులు, హింసతో ప్రపంచ వేదికపై దేశంలో మహిళలకు రక్షణలేదనే అపప్రథ నెదుర్కోవాల్సి రాకుండా ఉండడం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్భయ చట్టాన్ని జారీ చేయడంతోపాటు మహిళలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసను అరికట్టడానికి కృషి చేస్తున్న సంస్థలన్నింటినీ సఖి వన్ స్టాప్ సెంటర్ల ఏర్పాటు పేరుతో ఒకే గొడుగు కిందకు తెస్తూ తీసుకున్న నిర్ణయం అభినందనీయమే. నిజానికి నేషనల్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్, ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజనకు ఈ పథకం ఓ ఉపపథకంగా ఏర్పాటు చేయడం జరిగింది. సఖి ఓ.యస్.సిల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలతో నిర్భయ ఫండ్‌ని ఏర్పాటు చేయడం గమనార్హం. దేశంలో 29 రాష్ట్రాలు 8 కేంద్రపాలిత ప్రాంతాలలో 704ల సఖివన్ స్టాప్ సెంటర్ల ఏర్పాటు జరగగా మనరాష్ట్రంలో 33 సఖి సెంటర్ల ఏర్పాటు జరిగింది. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి సామాజిక పరిశోధనా కేంద్రం హోదాలో దేశంలోని సఖి వన్‌స్టాప్ సెంటర్లన్నింటికీ మేధోభాగస్వామిగా టిఐస్ ఎంపిక అభినందనీయమే. తెలంగాణ రాష్ట్రమే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఈ దేశంలోని అన్ని ప్రాంతాలలో వేళ్లూనుకున్న అనేక సామాజిక రుగ్మతలూ, సమస్యలను లోతుగా అధ్యయనంచేసి ప్రభావపూరితమైన పరిష్కారాల్ని సూచించిన ఘన చరిత్ర టిస్‌దే. ఈ సామాజిక అధ్యయన వేదిక ఓ ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థగా ఈ దేశంలో మహిళలపై వేధింపులు, గృహహింస, లైంగిక దాడులను అరికట్టి మహిళాలోకానికి ఓ శాంతియుతమైన జీవితాన్ని ప్రసాదించడం కోసం సమీకృత కృషిని చేపట్టబోయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మహిళా శిశుసంక్షేమ, అభివృద్ధి మంత్రిత్వశాఖలు, స్థానిక యన్.జి.ఓ.ల చర్యలను సమన్వయం చేస్తూ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంతోపాటు దాని అమలుకు అవసరమైన విధానాల పరికల్పనతో ఓ చుక్కాని లాగా పనిచేస్తుంది. విధానాలు, ప్రణాళిక ఎంత గొప్పవైనా క్షేత్రస్థాయిలో వాటిని అమలు పరిచే సిబ్బంది ఎంపికతోపాటు వారి అర్హతలూ, నైపుణ్యాలే కాదు అంకితభావంతో కూడిన వారి విధినిర్వహణపైనేఆశించిన ఫలితాలు సాధించడానికి వీలుంటుందనే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. భారతశిశుసంక్షేమ, అభివృద్ధి మంత్రిత్వశాఖ మార్గదర్శకాలనుసరించి నిర్భయ ఫండ్ నిధులతో తెలంగాణ రాష్ట్రంలో 33జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు ఛైర్మన్‌లుగా జిల్లాల మహిళా శిశుసంక్షేమ అభివృద్ధి అధికారులతో సమన్వయంతో సఖిసెంటర్లలో ఉద్యోగుల నియామకం, నిర్వహణ కోసం యన్.జి.ఓల ఎంపిక జరుగుతోంది. నేడు మెజారిటీ యన్.జి.ఓలు వ్యాపారసంస్థలుగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణల నేపథ్యంలో సేవాభావంతో పనిచేస్తున్న యన్.జి.ఓలను గుర్తించి వాటికి సఖి సెంటర్లను అప్పగించాల్సిన అవసరం ఎంతైనాఉంది. రాష్ట్రంలో మహిళల రక్షణకోసం పనిచేస్తున్న ఉమెన్‌హెల్ప్‌లైన్స్, హెల్ప్‌డెస్క్‌లు, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ వింగ్‌లు, ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, జిల్లాల న్యాయసేవా అధికార సంస్థలు సఖి వన్‌స్టాప్ సెంటర్లే వేదికగా సింగిల్ విండోగా ఏర్పడి మహిళలు, బాలికలను వివిధ రకాల హింసల బారినుండి కాపాడడం కోసం కృషి చేస్తాయి. అందులో భాగంగా గృహహింసకు, లైంగిక దాడులకు, వేధింపులకూ గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు తక్షణ అత్యవసర సహాయాన్ని అందించడంతోపాటు వైద్యసహాయాన్ని సమకూర్చడం, అవసరమైతే యఫ్.ఐ.ఆర్ నమోదుతో పోలీసుశాఖ తోడ్పాటుకు కృషి చేయడం ఒక ఎత్తైతే సైకో సోషల్ కౌన్సిలింగ్ ద్వారా మహిళలపై వేధింపుల సమస్యలను పరిష్కరించడమే పరమావధిగా ముందుకు సాగడం. ఇది వీలు కానప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించడానికి అవసర




మైన ఉచిత న్యాయసహాయాన్ని అందించడంకూడా సఖి సెంటర్ల బాధ్యతగానే ప్రకటించడం గమనార్హం. చివరిగా ఈ ప్రక్రియ సాగుతున్న కాలంలో బాధితులకు అవసరమైతే సెంటర్లో పూర్తి భద్రతతో అన్నిసౌకర్యాలతో ఆశ్రయాన్ని కల్పించడం విధానంలోభాగమే. పురుషులతోసహా మహిళలకు సమానమైన హోదాతో జీవించే హక్కుని ప్రసాదించి రాజ్యాంగ నిబంధనలకు తిలోదకాలిస్తూ మనుధర్మస్మృతి పునాదులపై నిర్మించబడ్డ పురుషాధిక్య సమాజం మహిళలను ఇంకా పిల్లలనుకనే యంత్రాలుగా, వంటింటి కుందేళ్లుగా, ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తూ వారిపై అనేకరకాల హింసలకు, లైంగికదాడులకు, పాల్పడుతున్న నేపథ్యంలో ఇంటా, బయటా బాలికలు, మహిళలు అనేక రకాల వేధింపులు, హింసకు గురవుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబంలో పురుషులే రాక్షసులుగా మారి బాలికలు, మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్న వైనం కంచే చేను మేస్తే కాపాడే వారెవరుంటారనే సామెతను గుర్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో సింగిల్ విండోగా మారిన సఖివన్ స్టాప్ సెంటర్లద్వారా తమకు ఆశించిన న్యాయం లభిస్తుందని బాధిత మహిళాలోకం కోటి ఆశలతో ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సఖిసెంటర్ల పనితీరుని విశ్లేషించినప్పుడు ఆయా సెంటర్లలో యన్.జి.ఓల ఎంపికతోపాటు అందులో పనిచేసే సిబ్బంది నియామకాల్లో రాజకీయ ఒత్తిళ్లు కొంతమేరకు పనిచేసినందునే సమర్థుల ఎంపిక జరగడం లేదేమోననే ప్రచారం కూడా లేకపోలేదు. ఫలితంగా ఎంపికైన సిబ్బందికి విషయ పరిజ్ఞానం ఉంటే ఉండవచ్చు గాని అత్యంత సంక్లిష్టమైన కుటుంబ వివాదాలను, మానవ సంబంధాలను అధ్యయనం చేసి వాటి మూలాల్లోకి వెళ్లిమారుతున్న మానవ ప్రవృత్తిని అర్థం చేసుకుని అమానవీయ హింసబారి నుండి బాధిత మహిళలు బాలికలను రక్షించేనిర్ణయాలు తీసుకునే అనుభవం లేకపోవడం ఓసమస్యగా మారుతుందని మనోవిజ్ఞానవేత్తలంటున్నారు. దీనికితోడు రాజకీయ జోక్యంతో గతంలో జరిగిన పల్లె పంచాయతీల లాగే ఈ సెంటర్లలోనూ దుడ్డువున్న వాడిదే బర్రె అనే రీతిలో కేసుల పరిష్కార తంతు కొనసాగుతుందని బాధితులు వాపోతుండడం శోచనీయం. కొంతమంది యన్.జి.ఓల అధినాయకులు నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో సఖి సెంటర్లలోనే నిద్రిస్తున్నారనే ఆరోపణలు బాధిత మహిళలు, బాలికల భద్రతకు భంగం కలిగించేవే. సైకో సోషయాలాజికల్ కౌన్సిలింగ్‌తో వివాదాలను పరిష్కరించి హింసను అరికట్టాల్సిన విధానానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వకుండా మెజారిటీ వివాదాలను యఫ్.ఐ.ఆర్‌ల నమోదుతోపోలీసు స్టేషన్లవైపు మళ్లిస్తున్నారనే వాదన కూడా ప్రస్ఫుటంగానే వినపడుతోంది. ఫలితంగా కౌన్సిలింగ్ కాగితాలకే పరిమితమై బాధితులంతా పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులేర్పడుతుండడం బాధాకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మహిళా శిశుసంక్షేమ, అభివృద్ధిశాఖల సమన్వయంతో స్థానిక యన్.జి.ఓల నేతృత్వంలో మహిళల రక్షణ కోసం పనిచేయాల్సిన తరుణంలో కేంద్రం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నందునే నిధుల కేటాయింపు జరగక నెలలతరబడి సంస్థ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేకపోతున్నామనే ప్రాధికార యన్.జి.ఓలతోపాటు రాష్ట్రప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే ఈ వాదనకు భిన్నంగా కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవడంలోనూ రాష్ట్రం విఫలమవుతున్నందనే ఆశించిన ఫలితాలను అందుకోలేకపోతున్నామనే కేంద్ర ప్రభుత్వ ప్రత్యారోపణలతో సఖిసెంటర్ల నిర్వహణ అగమ్యగోచరంగామారుతుండడం శోచనీయమే. సఖివన్‌టైమ్ సిబ్బంది తమ ఆదేశాలను పాటించడంలేదనే అక్కసుతో యన్.జి.ఓలను తప్పించి రాష్ట్ర ప్రభుత్వ మహిళా శిశుసంక్షేమ అభివృద్ధిశాఖద్వారానే సఖి సెంటర్లను నిర్వర్తించాలనే ఆలోచనకు ప్రభుత్వం వచ్చిందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. మహిళల రక్షణ కోసం, సంక్షేమం కోసం ఎన్ని చట్టాలను జారీ చేసినా, నేరస్తులకు ఉరిశిక్షలను విధించినా మహిళల భద్రతలో ప్రపంచంలో 136వ స్థానంలో ఉండడం 64 శాతం మహిళలపై నేరాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో సఖివన్ స్టాప్ సెంటర్లలో ఉద్యోగుల నియామక ప్రక్రియను తదనంతర నిర్వహణనూ పారదర్శకంగా నిర్వహించడంకోసంఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా సేవాదృక్పథంలో పనిచేస్తున్న యన్.జి.ఓలకే సఖి సెంటర్లను కేటాయించాలి. అవసరమైన అర్హతలూ, అనుభవం కలిగిన వ్యక్తులనే ఉద్యోగులుగా నియామకం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖివన్ స్టాప్ సెంటర్లను రాజకీయ వేదికలుగా మార్చకుండా సమాజంలో సగభాగమైన మహిళల రక్షణ కోసం ఈ నాలుగంచెల విధానాన్ని పూర్తి సమన్వయంతో త్రికరణశుద్ధిగా అమలుపరచాల్సిందే. ఓ ఉపన్యాయ వ్యవస్థ రూపంలో బాధితులకు ఆశించిన న్యాయాన్ని చేకూర్చాలే తప్ప రక్షణకోసం తమను ఆశ్రయించిన బాధితులందరినీ కట్టగట్టి పోలీసులు న్యాయస్థానాల వద్దకు చేర్చేమధ్యవర్తులుగా పనిచేయరాదనే సామాజికవేత్తల అభిప్రాయాన్ని గౌరవించాల్సిందే. ●




# ఢిల్లీకి వస్తే..ఏకే-47తో కాల్చేస్తామన్నారు: సంజయ్ రౌత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఎంపీ సంజయ్ రౌత్‌కు గ్యాంగ్‌స్టర్ల నుంచి బెదిరింపులు వచ్చాయి. దీంతో ఆయన ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనకు ఈ బెదిరింపులు వచ్చాయని ఆయన ఆరోపించారు. పంజాబ్ గాయకుడు సిద్ధూ మూసేవాలా మాదిరిగానే తనను చంపేస్తామని వారు హెచ్చరించారని రౌత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో కొందరు నాకు ఫోన్ చేసి బెదిరించారు. ఢిల్లీకి వస్తే ఏకే 47 తుపాకీతో కాల్చి చంపేస్తామని వారు హెచ్చరించారు. మూసేవాలాను పట్టిన గతే నాకూ పడుతుందన్నారు. దీనిపై నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను' అని సంజయ్ రౌత్ మీడియాలో వెల్లడించారు. అయితే ఈ విషయంపై తాను ఫిర్యాదు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణించట్లేదని ఆయన ఆరోపించారు. గతంలోనూ నాకు ఇలాగే బెదిరింపులు వచ్చాయి. కానీ రాష్ట్ర హోంమంత్రి ఇది కేవలం స్టంట్ అని కొట్టిపారేస్తున్నారు. ప్రతిపక్ష నేతల భద్రతను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని రౌత్ దుయ్యబట్టారు. కాగా రౌత్ ఫిర్యాదుపై ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బెదిరింపులు వచ్చిన ఫోన్ నంబరును ట్రేస్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఓ అనుమానితుడిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇటీవల మరో గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ నుంచి బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు వచ్చిన విషయం విదితమే.

# రూ.150.95 లక్షలకోట్లకు చేరిన రుణభారం

## ప్రభుత్వ రుణనిర్వహణ నివేదిక ప్రకటించిన ఆర్థికశాఖ




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఆర్థికసంవత్సరం ముగియడంతో భారత్ ఆస్తిఅప్పుల పట్టీని సిద్ధంచేసింది. సెప్టెంబరు చివరినాటికి భారత్ అప్పులు 147.19 లక్షలకోట్లుగా ఉన్నాయి. అవి ఆర్థికసంవత్సరంముగిసేనాటికి 150.95 లక్షలకోట్లకు పెరిగినట్లు తేలింది. అక్టోబరు డిసెంబరుత్రైమాసికాల్లో చూస్తే ప్రతి మూడునెలలకు 2.6శాతంచొప్పున రుణభారం పెరుగుతున్నది. మొత్తం అప్పులు ప్రభుత్వ పద్దులో డిసెంబరు చివరినాటికి 1,50,95,970.8 కోట్లకు పెరిగినట్లు ప్రభుత్వ రుణ నిర్వహణ నివేదికలో పొందుపరిచింది. అదే గత సెపెన్టెంబరునాటికి మొత్తం అప్పులు 1,47,19,572.2కోట్లుగా ఉన్నాయి. శనివారం ఆర్థికశాఖ ఈమేరకు మొత్తం నివేదికప్రకటించింది. మొత్తం అప్పుల్లో ప్రభుత్వ రుణాలు 89శాతం వాటాతో ఉన్నాయి. సుమారు 29.29శాతం సెక్యూరిటీలు మెచూరిటీ ఐదేళ్లలోపే ఉంది. మూడో త్రైమాసికంలో కేంద్రం 3.51 లక్షలకోట్లను సెక్యూరిటీలద్వారా సమీకరించింది. వాస్తవానికి ప్రభుత్వం నోటిఫైచేసిన మొత్తం ఒక కేలండర్ సంవత్సరంలో 3.18 లక్షలకోట్లు కాగా అంతకుమించే సేకరించింది. మూడో త్రైమాసికంలో సెక్యూరిటీల మెచూరిటీలపై చెల్లించాల్సిన మొత్తం 85,377.9 కోట్లుగా ఉంది. ఈ మొత్తం చెల్లించినట్లు వెల్లడించింది. సెక్యూరిటీల జారీలో రాబడులు 7.38శాతంగామూడో త్రైమాసికంలో ఉంటే రెండోత్రైమాసికం కంటే స్వల్పంగా రాబడులు పెరిగాయి. కొత్తగా జారీచేసే సెక్యూరిటీల మెచూరిటీలు 16.56 సంవత్సరాలుగా ఉంది. అదే రెండోత్రైమాసికంలో 15.62 సంవత్సరాలకుమెచూరిటీ పరిమితిగా నిర్ణయించింది. అలాగేనగదు నిర్వహణ బిల్లులరూపంలో ప్రభుత్వం ఎలాంటి నిధులను సేకరించలేదని ఆర్థికశాఖప్రకటించింది. ఈ త్రైమాసికంలో రిజర్వుబాంకు ప్రభుత్వంకోసం ఎలాంటి ఓపెన్‌మార్కెట్ లావాదేవీలు నిర్వహిం చలేదని తేల్చింది. నగదు సర్దుబాటు సౌకర్యం కింద రోజువారి సగటు నగదు నిర్వహణ 39,604 కోట్లుగా ఉంది. ఇక సెక్యూరిటీలపరంగా చూస్తే పదేళ్ల బెంచ్‌మార్క్ సెక్యూరిటీలపై 7.40శాతంగా సెప్టెంబరుచివరినాటికి ఉంది. అదే డిసెంబరు చివరినాటికి 7.33శాతంగా ఉంది. ఏడు బేసిస్ పాయింట్లు రాబడులు తగ్గాయి. గత ఏడాదిడిసెంబరు ఏడో తేదీ ఆర్‌బిఐ నిర్వహించిన మానిటరీ పాలసీ సమీక్షలో కమిటీ రెపోరేట్లను 35 బేసిస్‌పాయింట్లను పెంచింది. దీనితో రెపోరేట్లు 5.9శాతంనుంచి 6.25శాతంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం కట్టడిచేసేందుకే ఈ చర్యలుచేపట్టినట్లు అప్పట్లో ఆర్‌బిఐ ప్రకటించింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి ఎనిమిదవ తేదీ రిజర్వుబ్యాంకు బెంచ్ మార్క్ రెపోరేట్లను మరో 25 బేసిస్ పాయింట్లు పెంచింది.ద్రవ్యోల్బణ కట్టడిచర్యల్లో భాగంగా ఈపెంపు చేసామని చెప్పడంతో రెపోరేట్లు 6.5శాతానికి పెరిగాయి.

# రికార్డుస్థాయిలో జిఎస్టీ వసూళ్లు: మార్చిలో 1.60 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** జిఎస్టీ వసూళ్లు మరోసారి లక్షన్నరకోట్లను దాటేసాయి. మార్చినెలలో జిఎస్టీ వసూళ్లు 13శాతంపెరిగి 1.60 లక్షలకోట్లుగా ఉన్నట్లు ఆర్థిక శాఖప్రకటించింది. ఈ ఆర్థికసంవత్సరంలో వరుసగా నాలుగోసారి లక్షన్నరకోట్లు దాటిందని ఆర్థికశాఖ వివరించింది. మార్చినెలలో 1,60,122కోట్ల మేర జిఎస్టీ వసూళ్లు జరిగితే ఆ మొత్తంలో సిజిఎస్‌టి 29,546 కొటట్లు, ఎస్‌జిఎస్టీ 37,314కోట్లు, ఐజిఎస్‌టి 82,907 కోట్లరూ పాయలుగా ఉంది. ఈ మొత్తం 42,503 కోట్ల రూపాయలు దిగుమతి వస్తువులపై వేసిన సుంకంగా పేర్కొంది. అలాగే అదనపు సెస్‌రూపంలో 10,355 కోట్లు వసూలుచేసింది. ఈ మొత్తంలో కూడా 960 కోట్లు దిగుమతులద్వారా సమకూరిందని ఆర్థికశాఖ ప్రకటించింది. ఐజిఎస్టీ వసూళ్లు ఈసారి అత్యధికంగా రాబట్టినట్లు స్పష్టంఅవుతోంది. ప్రభుత్వం 33,408 కోట్లు సిజిఎస్‌టి, 28,187 కోట్లు ఎస్‌జిఎస్‌టిని నిరంతర సెటిల్‌మెంట్‌కింద రాష్ట్రాలకు కేటాయించింది. కేంద్ర, రాష్ట్రాలకు మొత్తం రాబడులు మార్చినెలలో ఐజిఎస్‌టి సెటిల్‌మెంట్ తర్వాత 62,954 కోట్లుగా సిజిఎస్‌టికి ఉంటే, 65,501 కోట్లు ఎస్‌జిఎస్‌టికి ఉన్నట్లు తేలింది. గత ఏడాది ఇదేనెల రాబడులకంటే జిఎస్టీ 13శాతం అధికంగా ఈ ఏడాది రాబట్టింది. దిగుమతులపై విధించిన సుంకాలు,పన్నులు కూడా 8శాతంపెరిగింది. దేశీయ లావాదేవీలు కూడా 14శాతం గత ఏడాది మార్చికంటేపెరిగినట్లు తేలింది. అలాగే మార్చినెలలో రిటర్నులు కూడా 93.2శాతంపెరిగాయి. జిఎస్‌టిఆర్‌వన్‌లో భారీ వృద్ధినమోదుకాగా జిఎస్‌టి ఆర్3బిలు కూడా పెరిగాయి. 91.4శాతం రిటర్నులు దాఖలయినట్లు ఆర్థికశాఖ వివరించింది. 2022:23 సంవత్సరానికిగాను స్థూల జీఎస్టీ రాబడులు 18.10 లక్షలకోట్లుగా ఉంది. నెలసరి సగటు వసూళ్లు పూర్తి సంవత్సరంలో 1.51 లక్షలకోట్లుగా ఉన్నాయి. 2022:23 లో స్థూల రాబడులు గత ఏడాదికంటే 22శాతంపెరిగాయి. సగటు స్థూల రాబడులు చివరి త్రైమాసికంలో 1.55 లక్షలకోట్లుగా ఉంది. అంతకుముందు త్రైమాసికాల్లో వరుసగా 1.51 లక్షలు, 1.46 లక్షలు, 1.49 లక్షలకోట్లుగా ఉన్నాయి.




# విదేశీ పర్యటన కోసం రూ.4 కోట్లు

## రిషి సునాక్‌పై విమర్శలు



**లండన్, ఏప్రిల్ 1:** బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రిషి సునాక్‌ను విమర్శలు, వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా ఆయన మరోసారి వివాదాస్పద వార్తల్లో నిలిచారు. ఇటీవల రిషి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఓ కొత్త పాలసీపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ మేరకు యూకే ప్రధాని రిషి సునాక్ విదేశీ పర్యటనల కోసం కేవలం ప్రైవేట్ జెట్ల కోసమే సుమారు రూ.4 కోట్ల ఖర్చు పెట్టినట్లు నివేదిక వెల్లడించింది. ఈజిప్టులో జరిగిన కాప్ 27సదస్సుకు హాజరయ్యేందుకు ప్రభుత్వం ప్రైవేట్ జెట్లకు దాదాపు రూ.96 లక్షలు ఖర్చు చేసింది. తన భార్య అక్షతా మూర్తి వ్యాపార ప్రయోజనాల కోసమే ఆ నూతన విధానాన్ని తీసుకొచ్చారంటూ రిషిపై విమర్శలు గుప్పిస్తున్నాయి. మార్చి ఆరంభంలో యుకే ప్రభుత్వం స్ప్రింగ్ బడ్జెట్‌ను ప్రవేశపె ట్టింది. అందులో చిన్నారుల సంరక్షణను ఆయాల సేవలను అందించే కంపెనీలకు ప్రోత్సాహకాలు కల్పించేలా నూతన పైలట్ పథకాన్ని ప్రకటించారు. కాగా ఇలాంటి సేవలనే అందించే కోరు కిడ్స్ లిమిటెడ్ అనే కంపెనీలో రిషి సతీమణి అక్షతా మూర్తి వాటాదారుగా ఉన్నారు. దీంతో భార్య వ్యాపార ప్రయోజనాల కోసమే ప్రధాని ఈ పైలట్ ప్రాజెక్టును ప్రవేశపెట్టారంటూ ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.' ఈ స్కీమ్‌ను తీసుకురావడం వెనుక ప్రత్యేక ఆసక్తి ఏమైనా ఉందా? సొంత ప్రభుత్వ విధానాల నుంచి రిషి కుటుంబం అదనపు ఆదాయాన్ని పొందాలనుకుంటుందా? ఈ ప్రశ్నలకు సునాక్ సమాధానం చెప్పాల్సిందే' అని ప్రతిపక్ష లిబరల్ డెమోక్రాట్ చీఫ్ విప్ వెండీ ఛాంబెర్లేన్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలను 10 డౌనింగ్ స్ట్రీట్ ఖండించింది. కాగా రిషి సునాక్ ప్రధాని కాకముందు కూడా తన భార్య పన్నుల వ్యవహారం తీవ్ర దుమారం రేపిన విషయం విదితమే.

# చుక్కలనంటిన పాకిస్థాన్ ద్రవ్యోల్బణం



## గతనెలలో 35.37%గా నమోదు

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 1:** పాకిస్థాన్‌లో ఏటికేడాది చూస్తే ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకుతోంది. మార్చి నెలలో ద్రవ్యోల్బణం 35.37శాతంగా ఉన్నట్లు ప్రభుత్వమే ప్రకటించింది. ఐదు దశాబ్దాల నాటి గరిష్టానికి చేరుకుంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి షరతులను అమలుచపరిచేందుకు పాకిస్థాన్‌ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో అన్ని రంగాలు కుదేలయ్యాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయి. నెలవారీగాచూస్తే సగటున 3.72శాతంగా పెరిగింది. గత ఏడాది ద్రవ్యోల్బణం 27.26శాతంగా ఉంది. ఆర్థికరంగపరంగా క్రమశిక్షణా రాహిత్యంవల్లనే ఈపరిస్థితులు దాపురించాయి. రాజకీయ అనిశ్చితి ఇందుకు తోడయింది. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి ఈరెండే కారణాలని నిపుణులు అంచనావేసారు. అంతేకాకుండా అంతర్జాతీయంగా నెలకొన్న ఇందన సంక్షోభం, మరోపక్క వరదల భీభత్సంతో మరింతకుదేలయింది. దేశంలోని మూడోవంతుభాగాన్ని గత ఏడాది వరదలు అతలాకుతలంచేసాయి. ప్రస్తుతం ఉన్న రుణభారం అధిగమించాలంటే పాక్‌కు బిలియన్లకొద్దీ డాలర్ల ఆర్థికసాయం అవసరం అవుతుంది. దీనికితోడు విదేశీ కరెన్సీ రిజర్వులు కూడా తగ్గిపోయాయి. పాకిస్థాన్‌రూపాయి అత్యంత కనిష్టస్థాయికి చేరింది. రంజాన్‌మాసంలో ముస్లిం సోదరులు పవిత్ర ప్రార్థనల సమయంలో కూడా ఆహార ఉత్పత్తులకోసం ఏర్పడిన రద్దీలో కనీసం 20 మందికిపైగా చనిపోయారు. ఆహార పంపిణీ కేంద్రాల వద్దజరిగిన తొక్కిసలాటలోనే ఈ మరణాలు సంభవించాయి. కరాచిలో ముందు రోజు జరిగిన తొక్కిసలాటలోనే 12 మంది చనిపోయారు. 2.20 కోట్ల జనాభా ఉన్న ఈ దక్షిణాసియా దేశం అత్యంతతీవ్రస్థాయి రుణభారంతో సతమతం అవుతోంది. ఇందుకోసం పన్ను సంస్కరణలు కూడా తీసుకురావాలి. ఐఎంఎఫ్ అందించే మలివిడత 6.5 బిలియన్ డాలర్ల బెయిలౌట్ ప్యాకేజికి ఐఎంఎఫ్ ఆదేశాలు తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం వచ్చింది.

# మా ఇంటికి రండి..మా ఇల్లే మీఇల్లు

## రాహుల్‌గాంధీకి నెటిజన్లు, కాంగ్రెస్ నేతల ట్వీట్లు



**బెంగళూరు, ఏప్రిల్ 1:** మోడీ ఇంటిపేరును కించపరిచారన్న అభియోగాలపై రెండేళ్ల జైలుశిక్ష, ఆపై లోక్‌సభలో అనర్హత వేటుపడిన రాహుల్‌గాంధీని ఆయన నివసిస్తున్న అధికారిక భవంతిని ఖాళీచేయాలని లోక్‌సభ సెక్రటేరియట్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఇపుడు ఎఐసిసి మాజీ అధ్యక్షుడికి సానుభూతి విపరీతంగా పెరిగిపోయింది. గడచిన రెండురోజులుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇతరులు కూడా 'మేరా ఘర్ ఆప్‌కా ఘర్' అంటూ ట్వీట్లు వెల్లువెత్తిస్తూ ఆయన్ను ఆహ్వానిస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకించి ఈ ప్రచారం కూడా ప్రారంభించారు. రాహుల్‌ను తమ నివాసానికి రావాలని ఆహ్వానాలు పంపిస్తున్నారు. మాజీ మంత్రులు కెజె జార్జి, దినేష్ గూండూరావు, జమీర్ అహ్మద్, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ ఇతరులు కూడా ఒక పోస్టరును చేతబట్టుకుని మా ఇల్లే మీ ఇల్లు అన్న నినాదాలతో ఉన్న బ్యానర్లను వారి ఇంటిముందు వేలాడదీసారు. రాహుల్‌గాంధీ లాంటి వ్యక్తికి ప్రభుత్వ భవనం అవసరం లేదని, తమనాయకుడు మా గుండెల్లోనే ఉంటాడని, మా ఇంట్లోనే ఉండాలని ఆహ్వానించడం మాకర్తవ్యమని రిజ్వాన్ ట్వీట్‌చేసారు. మేమంతా మీవెంటే. మాఇంటికి రండి అంటూ ట్వీట్లు వెల్లువెత్తించారు. ఈ కుట్రల తుపానులో మిమ్మల్ని నిరాశ్రయులని ఎవరుఅంటారు. మేమంతామీవెంటే అన్న ట్వీట్లు సోషల్‌మీడియాలో వెల్లువెత్తాయి.

# తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

**ముంబై, ఏప్రిల్ 1:** గ్యాస్ ధరలపై కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి రోజునే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల ధరలను సవరించింది. ఏప్రిల్ 1 వంట గ్యాస్ ధరలు దాదాపు రూ.92 తగ్గించింది. అయితే రేట్ల తగ్గింపు కేవలం వాణిజ్య గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు మాత్రమే. గృహోపయోగానికి వినియోగించే డొమెస్టిక్ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి తగ్గింపు లేదు. 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరలను ప్రభుత్వం గత నెలలోనే రూ.50 పెంచిన విషయం విదితమే. అలాగే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను రూ.350 పెంచింది. సాధారణంగా కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి రోజున పెట్రోలియం కంపెనీలు ఎల్‌పిజి సిలిండర్ల ధరలను సవరి స్తుంటాయి.డాలర్‌తో రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ రేటు భారతదేశంలో ఎల్‌పిజి సిలిండర్ ధరలను ప్రభావితం చేసే రెండు కీలక అంశాలు. సవరించిన తర్వాత 19 కేజీలవాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 2,028, కోల్‌కతాలో రూ.2,132, ముంబైలో రూ.1,980,చెన్నైలో రూ,.2,192.50 చొప్పున ఉంది. కాగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం గృహ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీని ప్రకటించింది. ఈ పథకంకింద 9.59కోట్ల మంది లబ్ధిదారులకు ప్రతిఎల్‌పిజి గ్యాస్‌సిలిండర్‌పైనారూ.200 సబ్సి డీ అందిస్తున్నట్లు సమాచార,ప్రసారశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ గతనెలలో ప్రకటించారు.

# ప్రాణాలకు తెగించి ముగ్గురు స్నేహితులను కాపాడిన పదేళ్ల బాలుడు

## రూ.లక్ష చెక్కు ఇచ్చి అభినందించిన గోవా ప్రభుత్వం

**పనాజీ, ఏప్రిల్ 1:** గోవాలో పదేళ్ల బాలుడు తనతో ఆడుకునే ముగ్గురు చిన్నారులను ప్రాణాపాయం నుంచి కాపాడి అందరి ప్రశంసలూ అందుకుంటున్నాడు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. గోవా రాజధాని పనాజీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుంబార్జువాలో గ్రామ దేవత ఉత్సవాలు జరుగుతుండగా, వాటిని తిలకించేందుకు నలుగురు చిన్నారులు అక్కడికి వెళ్లారు. రంగులు చల్లుకొని ఆడుకున్నారు. అనంతరం దగ్గరలోని నది వద్దకు వెళ్లారు. స్నానం చేసేందుకు నదిలోకి దిగిన ముగ్గురు చిన్నారులు నీటిలో జారి పడిపోయారు. వారికి ఈతరాక మునిగిపోయారు. అదంతా చూసిన అంకుర్‌కుమార్ సంజయ్‌ప్రసాద్ అనే పదేళ్ల బాలుడు వారిని కాపాడేందుకు నదిలోకి దూకాడు. ఒకరి తర్వాత ఒకరిని ఒడ్డుకు చేర్చాడు. సిపిఆర్ చేయడంతో వారు స్పృహలోకి వచ్చారు. అనంతరం స్థానికుల సాయంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. తన స్నేహితులను కాపాడేందుకు ధైర్యసాహసాలు ప్రదర్శించిన సంజయ్ పేరు గోవాలో మార్మోగుతోంది. బాలుడి సాహసాన్ని గుర్తించిన ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష బహుమతితో సత్కరించింది. సిఎం ప్రమోద్‌సావంత్ స్వయంగా చెక్కు అందించి బాలుడిని అభినందించారు. 'చిన్న వయసులో ధైర్యసాహసాలు ప్రదర్శించి తన స్నేహితులను కాపాడిన బాలుడిని కలవడం ఎంతో ఆనందంగా ఉంది. అంకుర్ సరైన సమయంలో తన సమయస్ఫూర్తితో తోటి పిల్లల జీవితాలను కాపాడాడు. అతణ్ని చూసి గోవా గర్విస్తోంది. అతణ్ని ప్రోత్సహించేందుకు రూ.లక్ష చెక్కు అందజేశాం. తనకు ఉజ్వల భవిష్యత్ ఉండాలని ఆశిస్తున్నాను' అని ప్రమోద్ సావంత్ ట్వీట్ చేశారు. బాలుడితో దిగిన ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



# వడోదరలో అల్లర్లపై దర్యాప్తునకు సిట్

## 23మంది అరెస్ట్, 500మందిపై ఎఫ్ఐఆర్

**గాంధీనగర్, ఏప్రిల్ 1:** శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా వడోదరలో చెలరేగిన అల్లర్లపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసినట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది. క్రైం విభాగం డిసిపి నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన పోలీస్ బృందం ఈ సిట్‌లో ఉంటుంది. వడోదరలోని కుంభద్వార..హాథీఖానా ప్రాంతంలో మార్చి 30న శోభాయాత్ర సందర్భంగా రాళ్లు రువ్విన ఘటన జరిగి, ఉద్రిక్తతలకు దారితీసింది. అల్లర్లను ప్రేరేపించేందుకు యత్నించినట్లు అనుమానమున్న 23మందిని వడోదర పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. అల్లర్లు జరిగినపుడు తీసిన వీడియో ఫుటేజ్ ఆధారంగా ఈ అరెస్టులు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

వడోదరలోని స్థానిక కోర్టులో నిందితుల్ని హాజరు పరచగా, వారిలో ఐదుగురిని ఐదురోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. మిగతా 18మందిని జ్యుడిషియల్ కస్టడీకి తరలించాలని ఆదేశించింది. ఈ ఘటనకు సంబంధించి మరో 500మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో శోభాయాత్ర వెళ్తున్నపుడు అల్లర్లు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# రూ.15,920 కోట్లకుపెరిగిన రక్షణరంగ ఎగుమతులు

## కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** భారత రక్షణరంగ ఎగుమతులు ఆల్‌టైమ్ రికార్డుస్థాయికి చేరినట్లు రక్షణ మంత్రిరాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. ఇదొక అనూహ్య లక్ష్య సాధన అని సంబంధిత విభాగాలనుప్రశంసించారు. ఈ ఆర్థికసంవత్సరంలో 15,920 కోట్ల ఎగుమతులు జరిగాయని, గత ఏడాది 12,814 కోట్లవరకూ జరిగిన ఎగుమతులు ఈ సంవత్సరంలో మరింతపెరిగాయని ఆయన అన్నారు. ఎగుమతులపై ఆయన తన ట్విట్టర్‌ఖాతాలో వివరాలు వెల్లడిస్తూ మిలిటరీ హార్డ్‌వేర్‌ను 8434 కోట్లరూపాయలు గత ఏడాది ఎగుమతి చేసామని, అంతకుముందు ఏడాది 9115 కోట్లు, 2018:19 సంవత్సరంలో 10,745కోట్లు ఎగుమతులుజరిగాయన్నారు. 2017:18 సంవత్సరంలో 4682 కోట్లు, 2016:17ల్లో 1521కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఇక రక్షణరంగ హార్డ్‌వేర్ తయారీలో 1.75 లక్షలకోట్లు విలువైన ఉత్పత్తులుజరగాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. దీనితో రక్షణరంగ ఎగుమతులు 2024:25 నాటికి 35వేలకోట్లకుపెరుగుతాయని అన్నారు. గడచిన కొన్నేళ్లుగాప్రభుత్వం దేశీయ రక్షణరంగ ఉత్పత్తులనుప్రోత్సహించేందుక అనేక సంస్కరణలు తెచ్చిందని ఆయన పేర్కొన్నారు.

## చెన్నైలోని కళాక్షేత్రలో లైంగిక వేధింపులు

# విద్యార్థినుల ఆందోళన



**చెన్నై, ఏప్రిల్ 1:** చెన్నైలోని కళాక్షేత్ర ఫౌండేషన్‌కు చెందిన ఓ కళాశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలొచ్చాయి. రుక్మిణీదేవి కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో హరిపద్మన్ అనే అసిస్టెంట్ ప్రొఫెసర్ మరో ముగ్గురు ఆర్టిస్టులపై కేసు నమోదైంది. ఓ పూర్వ విద్యార్థిని ఫిర్యాదుమేరకు ఈ కేసు నమోదైంది. లైంగిక వేధింపులు, బాడీ షేమింగ్, తదితర వేధింపులకు గురవుతున్నామని కొన్నిరోజులుగా 200మంది విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. 90మంది విద్యార్థినులు రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి కూడా లేఖరాశారు. యేళ్లుగా వేధింపులు, కుల వివక్ష ఎదుర్కొంటున్నామని, తమ ఫిర్యాదులపై అధికా రులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. కళాక్షేత్ర డైరెక్టర్ రేవతి రామచంద్రన్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. కురుక్షేత్ర ఫౌండేషన్‌ను1936లో రుక్మిణీదేవి అరుండలే స్థాపించారు. అక్కడ భరతనాట్యంలాంటి సంప్రదాయిక కళలను నేర్పే కోర్సులు అంది స్తారు. ఉన్నత ప్రమాణాలకు మారుపేరుగా ఉన్న సంస్థ ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంది.

# కులగణన జరపాల్సిందేనని ఎన్‌డిఎపై కాంగ్రెస్ ఒత్తిడి

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 1:** కులగణనకోసం కాంగ్రెస్‌పార్టీ ఇతర ప్రతిపక్ష పార్టీలన్నింటితోకలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ కుల గణన అనేది నిర్దిష్టంగా జరగలేదు. 1931లో జరిగిన కుల గణన ఆధారంగా మాత్రమే ఇపుడు ప్రభుత్వ విధివిధానాలు నడుస్తున్నాయి. ఒబిసి వ్యతిరేకకాంగ్రెస్ అని ప్రచారాన్ని ముమ్మరంచేస్తున్న బిజెపిని కట్టడిచేసేందుకు అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అయినా ఇప్పటికీ కులగణన ఎందుకు చేపట్టలేదన్న వాదనతో ఇపుడు కాంగ్రెస్ పార్టీ మరో కొత్త వాదనను తెరపైకి తెచ్చింది. తానుమాత్రమే కాకుండా తనతోపాటు కలిసివచ్చే అన్ని ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని అధికార బిజెపి విమర్శలకు కౌంటర్ ఇవ్వడంతోపాటు ఎప్పుడో 92 ఏళ్లకిందట జరిగిన కులగణన ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, దీనివల్ల అనేక మంది అర్హులు ప్రయోజనాలు కోల్పోతున్నారని కాంగ్రెస్ పార్టీ వాదిస్తోంది. సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, జనతాదళ్‌యునైటెడ్ పార్టీలతో ఇప్పటికే ఈ చర్చలుజరిగాయి. ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకుల తోకూడా కాంగ్రెస్ చర్చలుజరుపుతోంది. అన్నీ సజావుగా సాగితే సత్వ రమే ఇక కులగణన చేపట్టాలని డిమాండ్‌చేస్తూ ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ కృషిచేస్తోంది. మోడీ ఇంటిపేరును కించరపరిచిన రాహుల్‌గాంధీ దేశంలో మొత్తం ఒబిసి కులాన్నే కించపరి చారంటూ బిజెపి కాంగ్రెస్ పార్టీపై విమర్శల దాడిని పెంచిన సంగతి తెలిసిందే.ఇపుడు ఈ విమర్శలను తిప్పికొట్టేందుకు అసలైన అస్త్రం సిద్ధంచేయాలని నిర్ణయించిన కాంగ్రెస్ కులగణన సర్వేను తెరపైకి తెచ్చింది.

# ఒక్కరోజులో కరోనా కేసులు 2993, మృతి ఏడు

## దేశంలో మొత్తం బాధితులు 4,47,18,781

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్1:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 2993 కేసులు నమోదయ్యాయి. మృతి ఏడుగురు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,47,18,781కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,71,551 మంది కోలుకోగా 16,354 మంది దేశంలోని వివిద ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,876కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.78 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,44,111కి చేరగా,79,92,580 మందివరకు కోలుకున్నారు.1,48,441 మంది ప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 68,36,683కి చేరింది.అందులో 67,60,686మంది కోలుకున్నారు.71,622 మంది మరణించారు. కర్నాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,77,389కి చేరింది.అందులో 40,35,957 మంది కోలుకున్నారు.40,324 మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య35,96,790కి చేరింది.అందులో 35,57,963 మంది కోలుకున్నారు. 38,050 మంది మరణించారు.

# శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

## బొలెరో వాహనం, స్కూటర్ ఢీ

## ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

**పెద్దదోర్నాల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పెద్దదోర్నాల మండల పరిధి శ్రీశైలం ఘాట్ రోడ్డు శిఖరేశ్వర సమీపంలో బొలెరో వాహనం - స్కూటర్ ఢీకొని రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన శనివారం జరిగింది. ఈ సంఘటనలో నంద్యాల జిల్లా శ్రీశైలం దైవస్థానాకి చెందిన అర్చకుడు చిలిమికోట శివనాగ ప్రసాద్(47) పల్నాడు జిల్లా మాచర్ల ముదిరాజట్ సొసైటీ కాలనీకి చెందిన వాలంటీర్ కొరట వెంకటేష్(36) అక్కడికక్కడే మృతి చెందారు. బొలెరో వాహనంలో ఉన్న వెంకటేష్‌కు రోడ్డు పక్కన ఉన్న ఇనుప రాడ్డు పొట్టలో గుచ్చుకొని అక్కడికక్కడే మృతిచెందగా స్కూటర్‌పై వెళ్తున్న అర్చకుడు చిలిమికోట శివ నాగ ప్రసాద్ కూడా సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. డ్రైవర్ నల్లబోలు సుధీర్, ఉన్నం మహేష్‌కుమార్, దుర్గ హరిప్రసాద్, బెల్లంకొండ హరిబాబులకు గాయాలయ్యాయి. వీరు సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నారు. సమాచారం అందుకున్న పెద్దదోర్నాల ఎస్సై ఎం.శ్రీనివాసరావు తన సిబ్బందితో హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిలిమికోట శివనాగప్రసాద్, కొరట వెంకటేశ్వర్లు మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

# ప్రపంచదేశాల్లో 68.39 కోట్ల వైరస్‌కేసులు

## 68.31 లక్షల మరణాలు



**జెనీవా,ఏప్రిల్ 1:** ప్రపంచదేశాల్లో కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొత్తకేసులతో మరింత ఆందోళన పెరుగుతోంది. శనివారం నాటికిప్రపంచ వ్యాప్తంగా 68.39 కోట్లకుపైగా కేసులు నమోదుకాగా 68.31 లక్షలమందిచనిపోయారు. మరో 39,911 మంది పరిస్థితి విషమించింది. రికవరీలు 65.69కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.02 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. యూరోప్ దేశాల్లో 24.78 కోట్లమందికివైరస్‌సోకి 20.30 లక్షలమందిచనిపోయారు. మరో 6436 మందిపరిస్థితి విషమంగా ఉంద.ఇ రికవరీలు 24.35 కోట్లకుపైగా నమోదుకాగా మరో 23.59 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 12.57 కోట్లకుపైగా కరోనా కేసులు నమోదుకాగా 16.22 లక్షలమంది చనిపోయారు. మరో 7148 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.12 కోట్లకుపైగా నమోదుకాగా మరో 27.91 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.52 కోట్లకుపైగా బాధితు లుంటే వారిలో 15.40 లక్షలమందిచనిపోయారు. మరో 15,558 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 19.98 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.38 కోట్లమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. దక్షిణ అమెరికాదేశాల్లో 6.83 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వాటిలో 13.52 మరణాలునమోదయ్యాయి. మరో 10,160 కేసులు విషమపరిస్థితిలో ఉన్నట్లు తేలింది. రికవరీలు 6.64 కోట్లకుపైగా నమోదుకాగా మరో 5,73,924 మంది పరిస్థితి ఆందో ళనగా ఉన్నట్లు ఆదేశాలుప్రకటించాయి. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.28 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వారిలో 2,58,662 మందిచని పోయారు. రికవరీలు 1.21 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,71, 412 మంది పరిస్థితి అయోమయంగా ఉంది. 19 ద్వీపకల్పదేశాల్లో మొత్తం 1.40 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 26,702 మంది చనిపోయారు. రికవరీలు 1.38 కోట్లకుపైబడ్డాయి. మరో 1,51,707 మంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనేకొనసాగుతూ వైరస్‌తో సతమతం అవుతున్నారు.

**The Singareni Collieries Company Limited**
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM-507101, Telangana.
E-PROCUREMENT TENDER NOTICE

Tenders have been published for the following Services/Material Procurement through e-procurement platform.
For details, please visit https://tender.telangana.gov.in-or-https://www.scclmines.com

| NIT/Enquiry No.- Description/Subject - Last date and time for Submission of bid(s) |
| --- |
| E152200529- Supply of Haulage Steel Wire Ropes of 22MM & 26MM for various areas of SCCL - 06-04-2023 - 17.00 Hrs. |
| E032200523- Procurement of High pressure high speed Sterilizers with CMC for use at various SCCL Hospitals - 13.04.2023 - 17.00 Hrs. |
| E072200526 - Procurement of 2 Inch Width Conspicuity Radium Tapes on Specific make basis REFLOMAX MAKE on R/C for a period of 1 year - 15.04.2023 - 17:00 Hrs. |
| E132200548- Periodical Random Testing of Permitted Explosives (P1 & P5) & Detonators used for blasting in coal at all underground mines and LDC Explosives & accessories used for blasting in Coal at all Opencast Projects of SCCL for a period of 2 years - 19.04.2023 - 17:00 Hrs. |
| E162200543 - Procurement of Design, Supply, Erection & Commissioning of Pressurized Air ventilation system for the substations at RG OC3 CHP, RGOC1 CHP & KCHP - 20.04.2023. - 17:00 Hrs. General Manager (Material Procurement) |

| NIT/Enquiry No.- Description/Subject/Estimated Contract Value - Last date and time |
| --- |
| CW/KGM/e-63/2022-23, Dt: 29.03.2023 Maintenance and repair works including replacement of damaged old GI sheets with pre painted G.I sheets, replacement of damaged windows, repairs to toilets and other misc., works to S.C. Printing Press, Central Stores at Kothagudem Corporate, Bhadradri Kothagudem District, Telangana State. Rs. 46,81,458.00 - 15.04.2023 - 04.00 P.M. General Manager (Civil) |

PR/2023-24/MP/CVL/01
DIPR.No. 14087-PP/CL/Advt/1/2022-23. Dt: 01.04.2023



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## ఎమ్మెల్సీ కవిత పర్యటనలో అపశ్రుతి

### నృత్యం చేస్తూ అస్వస్థతకు గురైన బిఆర్ఎస్ నాయకుడు

### బండారి నరేందర్ చికిత్స పొందుతూ మృతి

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శనివారం బిఆర్ఎస్ నాయకుడు నృత్యం చేస్తూ గుండె పోటుతో మృతి చెందారు. బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు నృత్యాలు చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండారి నరేందర్ హుటాహుటిన పట్టణంలో ఓ హాస్పిటల్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బిఆర్ఎస్ నాయకులంతా తోటి కౌన్సిలర్లు, మిత్రులు. జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్ బండారి రజని భర్త బండారి నరేందర్. ఆయన ఇంటికెళ్లి ఎమ్మెల్సీ కవిత, మంత్రి కొప్పుల ఈశ్వర్ నివాళులర్పించారు. పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని రద్దుచేసి చంద్ర నరేందర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మధుర నరేందర్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ కవిత భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన భార్య రజనిని ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యాన్ని నింపింది. సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎల్.రమణ, ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తదితరులు నరేందర్ భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పోలీసు పోస్టుల భర్తీకి 8, 9 తేదీల్లో తుది రాత పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో జరుగుతున్న కొలువుల భర్తీల్లో భాగంగా ఎస్ఐ తత్సమాన పోస్టులు, ఎఎస్ఐ పోస్టులకు సంబంధించిన తుదిరాత పరీక్షలు ఈ నెల 8, 9వ తేదీల్లో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌లోని ఎంపిక చేసిన 4 కేంద్రాల్లో జరగనున్నాయి. ఈ మేరకు పోలీసు నియామక మండలి శనివారం ప్రకటన విడుదల చేసింది. ఎస్ఐ పోస్టులు.. సివిల్, సాయుధ బలగం, టీఎస్ఎస్పీ, ఎస్పీఎఫ్, పోలీసు రవాణా, ఐటీ, కమ్యూనికేషన్స్ తదితర విభాగాల్లోని ఖాళీల భర్తీకి పరీక్షలు జరుగనున్నాయి. ఎఎస్ఐ పోస్టులు.. ఫింగర్ ప్రింట్ బ్యూరోలోని పోస్టుల భర్తీకి ఎనిమిది, తొమ్మిదో తేదీల్లో జరగనున్న పరీక్షలు రెండేసి పేపర్లు జరుగనున్నాయి. కాగా తుది రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆరవ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీసు వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని నియామక మండలి తెలిపింది.

## రేపు ఢిల్లీలో మత్స్యకారుల ధర్నా

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా మత్స్యపరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి రూ. లక్ష కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. దేశ వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు, మత్స్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఏఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. మత్స్య వృత్తి రక్షణ, సామాజిక భద్రతా కల్పించాలని, సముద్రం, నదులు, కాలువలు, ప్రాజెక్టులు, చెరువులు, కుంటలను ప్రైవేటు పరం చేయవద్దని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు ఫించన్ మంజూరు చేయాలన్నారు. మత్స్యకారులకు ఎన్‌సీడీసీ ద్వారా సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న ఢిల్లీలో ధర్నా చేస్తున్నట్టు తెలిపారు. సేకరించిన సంతకాలతో ధర్నా రోజున కేంద్ర మత్స్య శాఖ మంత్రికి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించనున్నట్లు బాలకృష్ణ తెలిపారు.

## నిరుద్యోగుల విషయంలో కలిసి పోరాడుదాం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డికి షర్మిల ఫోన్



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలిసి పోరాటం చేద్దామని, ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేద్దామని కోరుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిలకు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫోన్ చేశారు. శనివారం వారికి ఫోన్ చేసి మాట్లాడారు. అందరం కలిసి ప్రగతిభవన్ మార్చ్‌కు పిలుపు నిద్దామని షర్మిల వారికి సూచించారు. సిఎం కెసిఆర్ మెడలు వంచాలంటే ప్రతిపక్షాలు ఏకం కావాలన్నారు. కలిసి పోరాటం చేయకపోతే ప్రతిపక్షాలను తెలంగాణ కెసిఆర్ బతకనివ్వరన్నారు. ఉమ్మడిగా పోరాటం చేసేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ తెలిపారు. త్వరలో సమావేశం అవుతామని, నిరుద్యోగుల విషయంలో ఉమ్మడి పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు. పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుందామని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతిపక్షాలు కలిసి పోరాటం చేయాల్సిన సమయం ఏర్పడిందన్నారు.

## విజయరామారావు ఏ పదవిలో ఉన్నా పదవికే వన్నె తెచ్చారు

### సంస్మరణ సభలో వక్తలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** విజయరామారావు ఏ పదవిలో ఉన్నా ఆ పదవి ఆయనకు శిరోభారం కాలేదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పోలీసు అధికారిగా, సిబిఐ డైరెక్టర్‌గా, రాజకీయ నాయకుడిగా, మంత్రిగా ఆయన పదవులు చేపట్టి ఆ పదవిలో నిగర్వంగా పనిచేశారని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్వనాథ్ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో విజయరామారావు సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. విజయరామారావు విశిష్టసేవలను పొందుపరుస్తూ రూపొందించిన విశ్వనాథ్ జయంతి ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ సాహిత్య పీఠం అధ్యక్షులు కొండలరావు, మాజీ డిజిపి మహేందర్‌రెడ్డి, మాజీ ఐపిఎస్ అధికారి ఆంజనేయరెడ్డి, ఎంపి కేశవరావు, ప్రజాశక్తి సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, పౌర హక్కుల నేత హరగోపాల్‌రావు, విజయరామారావు కూతురు అన్నపూర్ణ కుటుంబసభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విజయరామారావు ఏ పదవి కోసం ఎవరి ముందూ తలవంచలేదన్నారు. పోలీసుల నియామకాల కోసం పోలీస్ శాఖలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శమని మాజీ డిజిపి మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రతి నాలుగు పోలీస్‌స్టేషన్లకు ఒక విచారణ అధికారి ఉండాలని వారాలోజులు నుంచి ప్రతిపాదన ఉందని, కానీ ఇప్పటివరకు అమలు కావడం లేదని ప్రజాశక్తి సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. ఆయన అకాల మరణం దురదృష్టకరమన్నారు.

# బిఆర్ఎస్, బిజెపి ఎప్పుడూ కలవలేదు.. కలవవు

### ● కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ తోక పార్టీగా మారిందని పార్లమెంటులో రుజువైంది: బిజెపి ఎంపి లక్ష్మణ్



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** బిఆర్ఎస్, బిజెపి ఎప్పుడూ కలవలేదు, కలవదు అని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌పై మండిపడ్డారు. సిఎం మూడ విశ్వాసాల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని, రాముడికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు ఇవ్వలేని సిఎం కెసిఆర్ మాత్రమే అన్నారు. భద్రాచలం వెళ్తే సిఎం పదవి ఊడిపోతుందని రాముడిని సైతం అవమానించే దుస్థితి ఉందన్నారు. ఊసరవెల్లి రంగు మార్చినట్లు కెసిఆర్ బిఆర్ఎస్ నుంచి బిఆర్ఎస్‌కు మార్చాడని, కానీ ఓటమి తప్పదన్నారు. ఎన్నికల యేడాది కాబట్టి రైతుల మీద ఎనలేని ప్రేమ కనబరుస్తున్నారన్నారు. కేంద్ర నిధులు నుంచి రూ.200 కోట్లు ప్రకటించి సొమ్ము ఒకరిది సోకరిది అన్నట్లుగా ఉంది. రైతులకు ఇస్తానన్న ఉచిత ఎరువులు ఏమయ్యాయి. డబుల్ బెడ్ రూం ఇండ్లు ఎనిమిది సంవత్సరాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. యూపిలో కోటి 75లక్షల ఇండ్లు కడితే తెలంగాణలో 26000 ఇండ్లు మాత్రమే కట్టారు. అందులో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలోనే కట్టారు. ఈనెల 8న రూ.20,000 కోట్ల పనులకు తెలంగాణలో శ్రీకారం చుడుతున్నారు. పల్లెల అభివృద్ధి కోసం నేరుగా కేంద్రం డబ్బులు ఇస్తున్నది, తెలంగాణలో మాత్రమే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేదని రాష్ట్రాలు తెలంగాణ, ఏపి మాత్రమే, కెసిఆర్ కుటుంబ కలలు కల్లలు లాగానే మిగుల్తాయి. పెట్రోల్, డీజిల్ మీద కేంద్రం టాక్స్ తగ్గిస్తే మీ వాటా ఎందుకు తగ్గిస్తాలో కెసిఆర్? అన్నారు. పెట్రోల్, డీజిల్ జిఎస్‌టి పరిధిలోకి రాకుండా అడ్డుకున్నది హరీష్‌రావు అన్నారు. 30లక్షల కుటుంబాలు ఆందోళన చెందుతుంటే కెసిఆర్ రాష్ట్రాలు తిరుగుతున్నాడు, కానీ భరోసా ఇవ్వలేదన్నారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, విద్యాశాఖ మంత్రి, హోంమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కెటిఆర్ స్థాయి మరిచి మోడి మీద అవకులు చెవాకులు పేలుతున్నాడు. 2014 కంటే ముందు భారత్ ఇతర దేశాల సాయం కోసం వేచి చూసేది. ఇవ్వాల ప్రపంచ దేశాలు వారి సమస్య పరిష్కారం కోసం మోడి, భారత్‌వైపు చూస్తున్నారన్నారు. సిరిసిల్లా, తెలంగాణకు పరిమితం అయిన మీరు మాట్లాడతారా? అన్నారు. ప్రజలు ఇనినన సార్లు బుద్ధిచెప్పినా ఇంకా మీకు కనువిప్పు జరగడం లేదన్నారు. మోడి కుటుంబసభ్యుల ఆస్తుల మీద మీద కెసిఆర్, కుటుంబ సభ్యుల ఆస్తుల మీద సిట్టింగ్ జడ్జితో విచారణ చేద్దామన్నారు. మేము మోడి సర్కార్ చేసినపనుల మీదనేఓట్లు అడుగుతున్నామని, మీకు మీ సర్కార్ చేసినపనులు చెప్పి ఓట్లు అడిగేదమ్ముందా అంటూ ప్రశ్నించారు. రాజ్యసభలో ప్రతి రోజు తెలంగాణాకు కెసిఆర్ చేసిన మోసాలు కేంద్రం ఇచ్చిన విధులు ప్రశ్నిస్తూనే ఉన్నానన్నారు. కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ తోకపార్టీగా మారిందని పార్లమెంటులో రుజువైందన్నారు. జాతీయపార్టీ గుజరాత్‌లో ఏమైంది, ఈ శాన్య రాష్ట్రాలలో ఎందుకు పోటీ చేయడంలేదు, కర్నాటకలో కుటుంబం పార్టీలైన కాంగ్రెస్, జెడిఎస్, బిఆర్ఎస్ కలుస్తాయన్నారు. పోస్టర్‌లకు ప్రజలకు సమాధానం ఇస్తారని, కాంగ్రెస్, టిఆర్ఎస్ కలిసి ప్రభుత్వం ఉన్నది నిజం అన్నారు.

## టిఎస్‌పిఎస్‌సికి కొత్త బోర్డును ఏర్పాటు చేయాలి

### ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసా కల్పించాలి

### ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ)ని ప్రక్షాళన చేసి.. కొత్త బోర్డును నియమించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్‌సీ కమిషన్ కార్యదర్శితోపాటు ఒక సభ్యుడిని సిట్ అధికారులు నోటీసులు జారీ చేసి విచారించిన నేపథ్యంలో కొత్త బోర్డును రాజకీయాలకు అతీతంగా కొత్తబోర్డును నియమించాలన్నారు. పేపర్ లీకేజీ కారణంతో లక్షలాది మంది నిరుద్యోగులు మానసికంగా ఆందోళన చెందుతున్నారని.. కనీసం ఇప్పటికే మరల జరిగేటటువంటి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత బోర్డు అధ్వర్యంలోనే మరోసారి పరీక్షలకు వెళ్తే పేపర్ లీకేజీ అయ్యే అవకాశాలు ఉన్నాయన్న అభద్రతాభావంలో నిరుద్యోగులు ఉన్నారని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని స్వరాష్ట్రంలో ఉద్యోగాలు వస్తాయని చెప్పి ఆశతో రేయింబవళ్లు కష్టపడి చదివిన నిరుద్యోగులు ఉద్యోగాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే .. ఆర్థికంగా స్థిరపడ్డ కొంతమంది మూర్ఖులు టీఎస్‌పీఎస్‌సీలో ఉన్న అధికారుల ద్వారా ప్రశ్నాపత్రాలను కొనుక్కొని ఉద్యోగాలు సంపాదించు కోవాలనుకోవడం దురదృష్టకరమన్నారు.

టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీ వెనుక ఎంతపెద్ద అధికారులు ఉన్నా వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నూతన బోర్డును ఏర్పాటు చేయనిపక్షంలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని మణికంఠరెడ్డి, లక్ష్మణ్ హెచ్చరించారు.

# దేశమంతా తెలంగాణ తరహా పరిస్థితి రావాలి

### నా రాజకీయ జీవితమంతా పోరాటాల మయమే

### షేట్కారీ సంఘటన్ నేతలకు గులాబి కండువా కప్పి ఆహ్వానించిన సిఎం కెసిఆర్



శనివారం తెలంగాణ భవన్‌లో మహారాష్ట్ర రైతు సంఘాల నేతలతో భేటీ అయిన సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 1:** ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఆటు పోట్లు చూశానని బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. తన రాజకీయ జీవతమంతా పోరాటాలే అని తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేస్తే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో మహారాష్ట్ర రైతు సంఘాల నేతలతో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కెసిఆర్ సమక్షంలో మహారాష్ట్ర రైతు నేత శరద్‌జోషి, ప్రణీత్, తదితరులు బిఆర్ఎస్‌లో చేరారు. వారికి కెసిఆర్ బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కెసిఆర్ మాట్లాడారు. దేశ రైతాంగానికి సాగునీళ్లు లేవని కరెంటు లేదు, పెట్టుబడి సాయం లేదు, అందుకే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదాన్ని తీసుకుని ముందకు పోతున్నామన్నారు. మన చేతిలో ఉన్న పవర్ ఫుల్ వోటును వినియోగించుకుని రైతు రాజ్యాన్ని తెచ్చుకోవాలె, మన చేతిలో వోటు అనే అస్త్రం ఉండగా, రోడ్ల మీద ఆందోళనలు పోరాటాలు అక్కరలేదన్నారు. మన వోటు మనం వేసుకుంటే రైతు రాజ్యం వస్తదని ఇందుకు గట్టి సంకల్పం కావాలని, శుద్ధి బుద్ది కావాలని చెప్పారు. గతంలో షెట్కారీ కామ్ గారీ పార్టీ పోటీ చేసి మహారాష్ట్రలో 76 సీట్లు గెలిచిందని, మనం ఇప్పుడు 200 సీట్లు గెలుస్తామని, అందుకు గట్టి సంకల్పం కావాలని స్పష్టం చేశారు. తన 50 యేండ్ల రాజకీయ అనుభవంలో ఉద్యమాలను ఆందోళనలు, ఎన్నో సమస్యలు, ఆటుపోట్లను చూశానని, తాను ఏసమస్యకు భయపడలేదని చెప్పారు. ఇప్పుడు తాను మరో నూతన ఉద్యమాన్ని భుజాలకెత్తుకున్నానని తెలిపారు. దేశంలోని రైతుల కష్టం చూసి రైతుల పోరాటం న్యాయమైనదనే భావనతో తాను జాతీయ రైతుల సమస్యలను తలకెత్తుకున్నానని తెలిపారు. రైతుల పోరాటం వల్లే కేంద్ర ప్రభుత్వం 3 సాగు చట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. సాగు చట్టాలపై రైతులు చేసిన పోరాటం న్యాయమైందని, వాళ్ల పరిస్థితి తలచుకొని కన్నీళ్లు పెట్టుకున్నానని, సిఎంగా ఉండి కూడా తాను రైతుల కోసం ఢిల్లీలో పోరాటం చేశానన్నారు. వారి కోసం ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని, 750 మంది రైతులు అమరులైన తర్వాత ప్రధాని దిగివచ్చిండన్నారు. రైతులకు క్షమాపణలు చెప్పాడని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరల కోసం రైతులు ఇంకెంత కాలం పోరాడాలి? తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పాటు కాక ముందు మహారాష్ట్ర కన్నా ఘోరంగా తెలంగాణ రాష్ట్ర పరిస్థితులు ఉండేటివన్నారు.

**దేశమంతటా తెలంగాణ తరహా పరిస్థితి**

కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం 94 లక్షల ఎకరాల్లో వరి పండుతుంటే ఒక్క తెలంగాణలో 56లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందన్నారు. యాసంగి సాగులో దేశంలోని తెలంగాణ అగ్రస్థానంలో ఉందని కెసిఆర్ తెలిపారు. రాష్ట్రంలో యాసంగిలో 50 లక్షలకు పైగా ఎకరాల్లో వరిసాగు అవుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక రైతుల ఆత్మ హత్యలు పూర్తిగా తగ్గిపోయాయని, దేశమంతటా తెలంగాణ తరహా పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వనరులు ఉన్నప్పటికీ దేశం అభివృద్ధి సాధించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. చాలాదేశాల్లో రైళ్ల వేగం గంటకు 1500కి.మీ. ఉంటే భారత్‌లో మాత్రం 150 కి.మీ.గా ఉందని స్పష్టం చేశారు.

## సిఎం కెసిఆర్ రైతులకు చేసింది ఏమీలేదు?

### ● బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతులకు చేసింది ఏమీ లేదని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ మండిపడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం కెసిఆర్ రైతులకు చేసిన ఘనకార్యం ఏమీలేదని, రైతులకు పంట నష్టపరిహారం చెల్లించలేదన్నారు. రైతులకు ఇచ్చే సబ్సిడీలు అన్ని బంద్ చేశారు. ఎరువులపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలు కెసిఆర్ ఎందుకు చెప్పడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ముందు చూపాలని డికె అరుణ డిమాండ్ చేశారు. డిస్కవరీ ఛానళ్లలో వచ్చిందని గొప్పలు చెప్పారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ముంచేశారని, తెలంగాణాను లూటీ చేశారంటూ మండిపడ్డారు.

ప్రధాని మోడి ఈనెల 8న హైదరాబాద్‌కు రానున్నారని, ఏప్రిల్ 6వ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం, ఏప్రిల్ 11న పూలే జయంతి, ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి కార్యక్రమాల నిర్వహణపై చర్చించామన్నారు. టిఎస్‌పిఎస్‌స వ్యవహారంలో కెటిఆర్ తప్పించుకునేందుకు ప్రయత్ని స్తున్నారన్నారు. సిట్, కేసిఆర్, జేబు సంస్థ, సిట్‌తో ఉపయోగంలో లేదన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, 30 లక్షల మంది అభ్యర్థులకు రూ.లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## అడవుల రక్షణకు పెద్దపులి సంరక్షణ అవసరం

### గ్రీన్ ఇండియా చాలెంజ్ తరఫున పులుల రక్షణకు మద్దతు

### ప్రాజెక్టుకు 50 యేళ్ల సందర్భంగా ఎంపి సంతోష్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అడవుల రక్షణ, పులల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 1973లో ప్రాజెక్టు టైగర్‌ను ప్రవేశపెట్టింది. ఏప్రిల్ 1వ తేదితో ఈ సేవ్ టైగర్ ఉద్యమానికి ఏళ్లు నిండాయి. దేశ వ్యాప్తంగా ఈ ప్రాజెక్టు టైగర్ కింద తీసుకున్న చర్యల వల్ల పులల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 1973లో 1827గా నమోదైన పులుల సంఖ్య 2022 నాటికి 2967కు చేరింది. టైగర్ రిజర్వుల సంఖ్య తొమ్మిది నుంచి 53కు పెరిగింది. ప్రాజెక్టు టైగర్ ప్రాధాన్యతను ఎంపి, అడవులు, పర్యావరణంపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు.

సేవ్ టైగర్ ఉద్యమం గోల్డెన్ జుబ్లి సందర్భంగా తెలంగాణకు చెందిన అమ్రాబాద్ టైగర్ రిజర్వు విడుదల చేసిన టైగర్ బుక్, టీ షర్ట్, కాఫీ మగ్ సావనీర్లను సంతోష్‌కుమార్ ప్రదర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం, అటవీశాఖ అమ్రాబాద్, కవ్వాల్ పులుల అభయారణ్యంలను చాలా బాగా నిర్వహిస్తుందని, పులులు సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అన్నారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్ తరుపున దేశ వ్యాప్తంగా పచ్చదనం పెంపుకు, పర్యావరణ రక్షణపై అవగాహన పెంపుకు కృషి చేస్తున్నామని, పులుల రక్షణకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ర్యావరణ సమతుల్యతలో పెద్దపులి అగ్రభాగాన ఉంటుందని, కొత్త తరాలకు ఈ అమోగమైన జంతువును చూసి కాపాడాల్సిన బాధ్యత అందించాలని ఎంపి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధులు కరుణాకర్, రాఘవ, శ్రీకాంత్‌బంధులు పాల్గొన్నారు.

## బిజెపి కుట్రలు చేస్తోంది

### అందుకే రాహుల్‌గాంధీని పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారు

### టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

### గాంధీభవన్‌లో గాంధీవిగ్రహం ముందు నిరసన చేపట్టిన కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** బిజెపి చేస్తున్న అన్యాయపు కుట్రల వల్ల రాహుల్‌గాంధీని పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారని టిపిసిసి ఓబిసి సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ మండిపడ్డారు. శనివారం గాంధీభవన్‌లో గాంధీభవన్ విగ్రహం ముందు కాంగ్రెస్ నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అక్రమంగా పార్లమెంటు నుంచి అనర్హత వేటు వేసిన నేపథ్యంలో బిజెపి కుట్రలను నిరసిస్తూ, ఏఐసిసి ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం అధ్యక్షులు నాగరిగారి ప్రీతం, ఎస్టీ విభాగం అధ్యక్షులు జగన్‌లాల్ నాయక్, మైనార్టీ విభాగం అధ్యక్షులు సోహైల్, ఓబిసి విభాగం అధ్యక్షులు నూతి శ్రీకాంత్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజెపి చేస్తున్న దమన నీతికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటాన్నిఅభినందిస్తూ, వారి చేసే పోరాటంలో వారికి దళిత, గిరిజన ప్రజలు ఎప్పుడు అండగా ఉంటారన్నారు. ఇప్పుడు పోరాటాలన్ని శాంతియుతంగా జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో అవసరమైతే ఈ పోరాటన్ని ఉధృతం చేసి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు పాల్గొనే విధంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరూ కలిసి రావాలన్నారు. బిజెపి అన్యాయపు కుట్రల కారణంగానే రాహుల్‌గాంధీని పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారన్నారు.

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 4000 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీని అన్యాయంగా పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో, ఈ దేశంలోఉన్న అనేక లక్షలాది మంది వారి అడుగులో అడుగేస్తూ కోట్లాది మంది భారతీయ ప్రజలు గర్వించారన్నారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యంలో ఇబ్బందులో ఉందని పాదయాత్ర చేపట్టారన్నారు. రాహుల్‌గాంధీ వచ్చే 2024 సంవత్సరంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తారని అన్నారు.

### అమెరికా నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో

## 10వసారి ప్రపంచ ఛాంపియన్‌గా శ్రీచైతన్య స్కూల్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** అమెరికా నాసా వారి ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ 2023లో శ్రీచైతన్య వరుసగా 10వ సంవత్సరం వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపం నలుమూలల నుంచి సుమారు 30కి పైగా దేశాలు పాల్గొనగా అందులో భారతదేశానికి నంబర్ 1 స్థానంలో శ్రీచైతన్య విద్యార్థులు నిలబెట్టారు. నాసా వారి ఎన్ఎస్ఎస్ కాంటెస్ట్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 138 ప్రాజెక్టుల్లో 89 ప్రాజెక్టులు ఒక్క భారత్ నుంచి ఎంపికవ్వగా.. అందులో 54 ప్రాజెక్టులు ఒక్క శ్రీచైతన్య నుంచే ఎంపికయ్యాయని శ్రీచైతన్య స్కూల్ డైరక్టర్ సీమ తెలిపారు. శ్రీచైతన్య నుంచి ఎంపికైన విన్నింగ్ ప్రాజెక్టులు 54 ఉండగా.. విన్నింగ్ ప్రాజెక్టులో 729 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీచైతన్య స్కూల్ వరల్డ్ ఫస్ట్ ప్రాజెక్టులు 5, సెకండ్ 10, థర్డ్ 8, హానరబుల్ మెన్షన్స్ 31 ఉన్నాయి. ఈ సందర్భంగా సీమ మాట్లాడుతూ వరల్డ్ ఫస్ట్, సెకండ్, థర్డ్ ప్రైజ్‌లలో గాని, విన్నింగ్ ప్రాజెక్టుల సంఖ్యలో గాని మరియు విన్నింగ్‌న ప్రాజెక్టుల్లో పాల్గొన్న విద్యార్థుల సంఖ్యలోగానీ ప్రపంచంలోనే భారతదేశంతో సహా మరే ఇతర దేశాలలో ఏ విద్యాసంస్థ శ్రీచైతన్య సాధించిన ఫలితాల్లో సగం ఫలితాలను కూడా సాధించలేదని తెలిపారు. అదేవిధంగా ఈ ఫలితాల ద్వారా శ్రీచైతన్య ప్రపంచంలోనే నంబర్ 1గా నిలిచిందన్నారు. శ్రీచైతన్య బట్టీపట్టే విధానానికి స్వస్థి పలుకుతూ కాన్సెప్ఛ్యువల్ టీచింగ్ మెథడాలజీ, యాక్టివిటీస్ మరియు ప్రాక్టికల్ ఓరియంటెండ్ టీచింగ్ ద్వారా మాత్రమే తాము ఇంతటి ఫలితాలు సాధిస్తున్నామని సీమ తెలిపారు. ఇంతటి అనితరసాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అధ్యాపకులకు మరియు అధ్యాపకేతర బృందానికి శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు అభినందనలు తెలిపారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

### ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మెరుపు ధర్నా



ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**హైదరాబాద్ (ధర్నా చౌక్), ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లతోపాటు ఇతర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్సీ ఎ.నర్సి రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన అకస్మాత్తుగా ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మెరుపు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ గత బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రంలో డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులతోపాటు వివిధ శాఖలలో పనిచేస్తున్న 11 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఏప్రిల్ 1 నుండి రెగ్యులర్ చేస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ధర్నాకు అనుమతి లేదని స్థానిక పోలీసులు ఆయనను వెళ్లిపోవాలని కోరినప్పటికీ, ప్రభుత్వం స్పందించే వరకు పోరాడుతానని హెచ్చరించారు. దీనితో ఆయనను అరెస్ట్ చేసి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### స్పేస్ సెటిల్‌మెంట్ డిజైన్ కాంటెస్ట్‌లో

## 76 ప్రాజెక్టులతో గ్లోబల్ లీడర్‌గా నారాయణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 1:** నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కె.ఓ నీల్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ 2021-23లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. వరల్డ్ నెం.1 స్థానంలో 6 సెలక్షన్స్ నారాయణ విద్యార్థులు దక్కించుకోగా, వరల్డ్ నెం.2 స్థానంలో 14, వరల్డ్ నెం.3 స్థానంలో 30 సెలక్షన్స్‌తో పాటు 26 హానరబుల్ ప్రైజులను నారాయణ విద్యార్థులు కైవశం చేసుకున్నారని నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ సింధూర నారాయణ, శరణి నారాయణ పేర్కొన్నారు. మొత్తంగా 76 ప్రాజెక్ట్‌ల్లో విజయకేతనం ఎగురవేసినట్లు తెలిపారు. ఈ ఘన విజయంతో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ నారాయణ విద్యార్థుల విజయ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోందన్నారు. గత 10 సంవత్సరాలుగా అద్భుత ఫలితాలు సాధిస్తూ ఇప్పటి వరకు 300లకు పైగా ప్రాజెక్టులు గెలుచుకుని వరల్డ్ నెం.1 స్కూల్‌గా నారాయణ మళ్ళీ తనను తాను నిరూపించుకుందని తెలియజేశారు. నేషనల్ స్పేస్ సొసైటీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ కాంటెస్ట్‌లో ప్రపంచ వ్యాప్తంగా వేలాది విద్యా సంస్థల నుంచి వందలాది ప్రాజెక్టులతో ఈ కాంపిటీషన్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా ప్రోగ్రామ్స్‌ను అమలు పరుస్తూ ఏకైక స్కూల్ నారాయణ మాత్రమే అన్నారు. దీని కోసం సీఓ స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ వంటి ప్రోగ్రామ్స్‌తో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ ప్రోగ్రామ్స్ కోసం ప్రత్యేకంగా అత్యున్నత స్థాయి మెటీరియల్‌ను రూపొందించామన్నారు. దీని ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో సింహభాగం నారాయణ విద్యార్థులు విజయం సాధించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా నాసా లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ నిర్వహించే కాంటెస్ట్‌కు సృజనాత్మకతతో కూడిన నూతన ఆవిష్కరణలు చేయాల్సి ఉంటుందన్నారు. దీని కోసం ఎంతగానో శ్రమించాల్సి ఉంటుందన్నారు. కనుకే క్లాస్‌రూమ్‌లో బోధించేటప్పుడే ప్రతి అంశంపై విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించేలా, విశ్లేషించుకునేలా, నూతన ఆవిష్కరణల వైపు ప్రేరేపించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో నారాయణ విద్యార్థులు సాధిస్తున్న నిరంతర ఘన విజయాల వెనుక నారాయణ సుపీరియర్ ప్లానింగ్, సూపర్‌లేటివ్ టీచింగ్ మెన్టర్‌గా నిలుస్తున్నాయన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా సిబిఎస్ఈతో కూడిన ఇంటిగ్రేటెడ్ కరిక్యులమ్‌ను ప్రవేశపెట్టి, విద్యను అందించటం వలనే ఇలాంటి ఎన్నో అద్భుత ఫలితాలు వెలువెడుతున్నాని పేర్కొన్నారు. ప్రాథమిక దశ నుంచే శాస్త్ర, సాంకేతిక అంశాలపై పరిజ్ఞానం పెంచుకోవటంతో పాటు, నూతన ఆవిష్కరణలు కనుగొనే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఘన విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

## రవాణాకు రూ.6,391 కోట్ల రెవెన్యూ

### గత యేడాది కంటే 60.92 శాతం అధికంగా ఆదాయం

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరంలో రవాణా శాఖకు 6,390.80 కోట్ల రూపాయల మేర రెవెన్యూ సమకూరింది. గత 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రెట్టింపు కంటే మించి 60.92 శాతం అధికంగా 2,419.42 కోట్ల రూపాయలు అదనంగా వచ్చింది. గత 2021-22 ఆర్థిక సంవత్సరంలో రవాణా శాఖకు 3,971.38 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. కాగా 2022-23 సంవత్సరంలో వాహనాలకు త్రైమాసిక పన్ను (క్వార్టర్లీ టాక్స్) కింద 779.09 కోట్ల రూపాయలు, లైఫ్ టాక్స్ కింద 4,670.04 కోట్ల రూపాయలు, గ్రీన్ టాక్స్ ద్వాం 64.63 కోట్ల రూపాయలు, ఫీజుల కింద 552.53 కోట్ల రూపాయలు, డిటెక్షన్ కింద 189.93 కోట్ల రూపాయలు, యూజర్ చార్జీల ద్వారా 134.58 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 6,390.80 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. వసూలు చేసిన పన్నుల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా పన్నులు కట్టకుండా తిరుగుతున్న 21,347 వాహనాలను తనిఖీ చేసి 54.21 కోట్ల రూపాయల మేర పన్నులు, 9.37 కోట్ల రూపాయల అపరాధ రుసుం మొత్తం 63.58 కోట్ల రూపాయలను వసూలు చేసింది.

### పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా రావుల రాజేందర్ నియామకం

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా రావుల రాజేందర్‌ను పార్టీ అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ నియమించారని ఆ పార్టీకి చెందిన జనరల్ సెక్రటరీ ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. కాగా రావుల రాజేందర్ మాజీ కార్పొరేటర్. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

## పులుల సంరక్షణలో తెలంగాణ ప్రభుత్వం విఫలం

బడ్జెట్‌లో గొప్పలు, క్షేత్రస్థాయిలో అందని నిధులు

ప్రాజెక్టు టైగర్ కేంద్ర ప్రాయోజిత పథకంలో రాష్ట్ర వాటా రూ.2.2కోట్లు చెల్లించని పరిస్థితి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రూ.2.75లక్షల కోట్లతో తమది భారీ బడ్జెట్ అంటూ గొప్పలు చెప్పుకుంటుందని, కానీ రాష్ట్రంలో పులుల సంరక్షణకు, పోషణకు రాష్ట్రవాటాలో భాగంగా అవసరమైన రూ.2.2కోట్ల రూపాయల నిధులను కేటాయించకపోవడం, రాష్ట్ర బడ్జెట్ ఒక డాంభికంగా స్పష్టమవుతుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో పులులు సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కోటి రూపాయలు కూడా విడుదల చేయకపోవడం విచారణకరం అన్నారు. దాని ఫలితంగా కవ్వాల్, అమ్రాబాద్ రిజర్వ్‌లో అగ్నిమాపక కార్యకలాపాలు, ఇతర అవసరమైన కార్యక్రమాలకు సరైన ఆర్థిక సహాయం అందం లేదన్నారు. నిధులు బదిలీ విధానం ప్రకారం, భారత ప్రభుత్వం తన వాటా నిధులను నాలుగు విడదతలుగా బదిలీ చేస్తుందన్నారు. అయితే భారత ప్రభుత్వం నుంచి వాటాను స్వీకరించిన నెల రోజుల్లోపు రాష్ట్రం తన వాటాను విడుదల చేయాలని, కానీ దురదృష్టవ శాత్తు, ఇది జరగకపోవడం వల్ల టైగర్ రిజర్వ్‌లకు తీవ్రమైన నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. కనీసం ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వ ఈ నిధులను విడుదల చేసి, దేశంలో పులుల సంఖ్యను పెంచేందుకు కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నా మన్నారు. 50 సంవత్సరాల క్రితం ఏప్రిల్ 1,1973న భారతదేశంలో పులులు సంరక్షణకు ప్రోత్సహిం చేందుకు భారతదేశంలో ప్రాజెక్టు టైగర్ ప్రారంభమైందన్నారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ప్రకారం ఈ ప్రాజెక్టును 18 టైగర్ రేంజ్ రాష్ట్రాలలో అమలవు అవుతుంది. తెలంగాణలో రెండు ప్రాంతాలలో ఉండగా, ఒక కవ్వాల్, రెండవది అమ్రాబాద్. కవ్వాల్, 2015.44 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండగా, అమ్రాబాద్ 2611.39 విస్తీర్ణంలో ఉంది. ఇవేకాకుండా 3296.31 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో తెలంగాణ, ఏపి రాష్ట్రాలలో నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వ్ విస్తరించి ఉంది. ఇక కంపా నిధుల కింద రూ.3110కోట్లు విడుదల చేసిందన్నారు.

## 47 రోజుల్లో 96 లక్షలకుపైగా కంటిపరీక్షలు

- కంటివెలుగు, ఆరోగ్య మహిళ, పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్ ఇళ్లపై కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న కంటి వెలుగు కార్యక్రమం, ఆరోగ్య మహిళ, పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, జిఓనెంబరు. 58,59,76,118 అమలుపై సాధించిన ప్రగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్సు నిర్వహించి సమీక్షించారు. గత 47 రోజుల్లో 96 లక్షల మందికిపైగా ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారని, ఈ ఘనత సాధించినందుకు కలెక్టర్‌లను సిఎస్ అభినందించారు. రానున్న 50రోజుల్లో రెండు కోట్ల మందికి కంటి పరీక్షలు చేసి కొత్త రికార్డును సృష్టిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. కలెక్టర్‌లు ఇదే మాదిరిగా తమ పనిని కొనసాగించాలని, కంటి వెలుగు శిబిరాలను క్రమతప్పకుండా తనిఖీ చేయాలని, తద్వారా క్యాంపులలో అందించే సేవలపై లబ్దిదారులు సంతృప్తి చెందేలా చూడాలని సిఎస్ సూచించారు.

మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా మరింత చేపట్టాలని కలెక్టర్‌లకు సిఎస్ సూచించారు. అర్హులైన మహిళలకు సేవలందించడమే లక్ష్యంగా, నిర్వహణ విధానాన్ని మెరుగుపరుస్తూ కార్యక్రమాన్ని విస్తరించాలన్నారు. జిఓనెంబరు.58,59 కింద క్రమబద్దీకరణ కోసం ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేది నుంచి మరో నెల రోజులు పొడగించడం, జూన్ 2, 2014 నుంచి జూన్ 2, 2020 వరకు కటాఫ్ తేదిన పొడగిడచంతో, చాలా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని సిఎస్ తెలిపారు. ఇంతకుముందు క్రమబద్దీకరణ చేయించుకోని వారితో సహా అధిక సంఖ్యలో ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్‌లను కోరారు.

గతంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను కలెక్టర్లు పరిశీలించాలని, ఓఓ 58,59, 118కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరగా పరిష్కరించాలని సిఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్, వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఆర్ అండ్ బి కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జ, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ యోగితారాణా, ఆరోగ్య, కుటుంబం సంక్షేమశాఖ కమిషనర్ శ్వేతామహంతి, పురపాలక శాఖ డైరక్టర్ సత్యనారాయణ, సిసిఎల్‌ఏ సత్యశారదలు పాల్గొన్నారు.

## ఎన్టీపిసిలో 2400 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణానికి సిద్ధం

మొదటి దశ కింద ఇప్పటికే 1600 మెగావాట్ల ప్లాంటు పూర్తి

సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణలోని నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎన్టీపీసీ)లో 2400 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెల్లడించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వంతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) జరిగినట్లయితే రెండో దశ 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన 4000 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌లో మొదటి దశలో 1600 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్‌లో నిర్మించిన మొదటి 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ యూనిట్‌లో ఇటీవలే విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. క్రమంగా ఈ యూనిట్‌లో విద్యుత్ లోడ్‌ను పెంచుతూ మే నెల 15వ తేద నాటికి పూర్తి స్థాయిలో విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చెప్పామని చెప్పారు. జూన్ నెల చివరి నాటికి రెండవ యూనిట్‌లో కూడా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ప్లాంట్‌లో రెండు యూనిట్లలో 1600 మెగావాట్ల విద్యుత్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఇందులో 85 శాతం కేటాయింపు ఉండటం వల్ల రాష్ట్రానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కాగా రామగుండం ప్రాంతంలో మరో 185 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఇందులో 70 మెగావాట్లు ఫ్లోటింగ్ సోలార్ పవర్ యూనిట్ ద్వారా ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. తెలంగాణ సర్కార్ అనుమతిస్తే రామగుండం ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన రిజర్వాయర్‌పై ఫ్లోటింగ్ సోలార్ పవర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ఎన్టీపీసీ ఇడి తెలిపారు.

## ఢిల్లీ కేపిటల్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ గెలుపు

### 50 పరుగుల భారీ తేడాతో ఢిల్లీ జట్టు ఓటమి

### కెప్టెన్‌గా డేవిడ్ వార్నర్ అర్ధసెంచరీ



**లక్నో, ఏప్రిల్ 1 :** ఐపిఎల్ 2023 సీజన్‌లోమూడో మ్యాచ్ రసవత్తరంగా ముగిసింది. ఢిల్లీ కేపిటల్స్‌పై లక్నో సూపర్‌జెయింట్స్ 50 పరుగుల భారీ తేడాతో గెలిచింది. సొంతగడ్డపై మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ ఎంచుకున్న లక్నో టీమ్ మొదటి మ్యాచ్‌తోనే చెలరేగారు. ఓపెనర్ కేల్ మేయర్స్ 38 బంతుల్లో రెండుఫోర్లు, ఏడు సిక్స్‌లతో 73 పరుగులుచేసి విధ్వంసం సృష్టించాడు. మొత్తం 193 పరుగులుచేసింది. మేయర్స్‌తోపాటు చివరిలో నికొలస్ పూరన్ 21 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్స్‌లతోకలిపి మొత్తం 36 పరుగులుచేసాడు. ఢిల్లీ కేపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్, చేతన్‌సకారియారెండేసి వికెట్లు తీస్తే అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్‌లు చెరో వికెట్ తీసారు. మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కేపిటల్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఫీల్డింగ్‌ఎంచుకున్నాడు. దాంతో కేల్‌మేయర్స్‌తోకలిసి లక్నో ఇన్నింగ్స్‌ని కెప్టెన్ కెఎల్‌రాహుల్ 12 బంతుల్లో ఎనిమిదిపరుగులుచేసాడు. కానీ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఆతని తర్వాత వచ్చిన దీపక్‌హుడా 17, మార్కస్ స్టొయినిస్ 12 పరుగులతో తక్కువ స్కోరుకే ఔట్ అయ్యారు. కానీ చివరిలో ఆయుష్ బదౌని ఏడు బంతుల్లో ఒక ఫోరు, రెండుసిక్స్‌లతో 18 పరుగులుచేసాడు. చివరి బంతికి ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన కృష్ణప్ప గౌతమ్ సిక్స్‌తో ఇన్నింగ్స్‌ముగించాడు. దాంతో లక్నో జట్టు ఆరువికెట్ల నష్టానికి 193 పరుగులుచేసింది. ఢిల్లీకేపిటల్స్‌కు 194 పరుగులు లక్ష్యం విధించింది. తర్వాత లక్ష్యఛేదనలో ఢిల్లీకేపిటల్స్ కెప్టెన్ వార్నర్ 48 బంతుల్లో 56 పరుగులుచేసాడు. ఏడుఫోర్లుకూడా ఉన్నాయి. అర్ధసెంచరీతో సత్తాచూపించాడు. రిలీ రస్సో 20 బంతుల్లో 30 పరుగులుచేసి రాణించాడు. చివరిలో అక్షర్‌పటేల్ మెరుపులు మెరిపించినా అప్పటికే జాప్యం జరిగిపోయింది పృథ్వీషా 12, మిచెల్‌మార్స్ (0)సర్ఫరాజ్‌ఖాన్ నాలుగుపరుగులతో నిరాశపరిచారు. లక్నో బౌలర్లలో మార్క్‌వుడ్ నాలుగు ఓవర్లలో కేవలం 14 పరుగులుమాత్రమే ఇచ్చి ఐదు వికెట్లుతో దుమ్మురేపాడు. ఆవేష్‌ఖాన్, రవిబిష్ణోయ్‌చెరో రెండు వికెట్లతో సత్తాచాటారు. మొదటి నాలుగు ఓవర్లలో ఢిల్లీజట్టు దూకుడుగా ఆడింది. వార్నర్; పృథ్వీషా బౌండరీలతో స్కోరుబోర్డు పరుగులు తీసింది. ఇంగ్లండ్ స్టార్‌బౌలర్ మార్క్‌వుడ్ రాకతో ఇన్నింగ్స్ స్వరూపమే ఒక్కసారిగా మారిపోయింది. వరుసబంతుల్లో పృథ్వీషా, మిచెల్‌హార్స్‌ను ఔట్‌చేసి కోలుకోలేని దెబ్బతీసాడు. కాసేపటికే సర్ఫరాజ్‌ఖాన్‌కూడా ఔట్ అయి ఢిల్లీకి మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టాడు. రిలీరసో కాసేపు మెరిసాడు. కానీ రవిబిష్ణోయ్ ఢిల్లీ కేపిటల్స్‌ను దెబ్బతీసాడు. రిలీ రస్సో, పావెల్‌ను స్వల్పవిరామాల్లో ఔట్‌చేసాడు. దీనితో 94 పరుగులకే ఐదు వికెట్లు నష్టపోయిన ఢిల్లీ జట్టు వీలు చిక్కినపుడల్లా బౌండరీలు బాదుతూ వార్నర్ జట్టుకు ఉత్తేజం తెచ్చాడు. ఈక్రమంలోనే అర్థసెంచరీపూర్తిచేసాడు. అర్థసెంచరీతర్వాత వార్నర్ ఔట్ కావడంతో ఢిల్లీకి ఓటమి తప్పలేదు. చివరిలో అక్షర్‌పటేల్‌మెరుపులు మెరిపించినా ఫలితం లేకపోయింది. చివరి ఓవర్‌లోమరో రెండు వికెట్లు తీసి మార్క్‌వుడ్ ఐదు వికెట్లతో స్టార్‌గా నిలిచాడు.

## మద్యం ద్వారా ఖజానాకు ఫుల్ జోష్

### రికార్డు స్థాయిలో రూ.31,560 కోట్ల రాబడి

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణలో మద్యం అమ్మకాలు రాష్ట్ర ఖజానాకు ఫుల్ జోష్‌ను తెచ్చిపెట్టాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖకు రికార్డు స్థాయిలో ఏకంగా 31,560 కోట్ల రూపాయల మేర ఆదాయం వచ్చింది. అమ్మకాల విషయానికి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 35,036 కోట్ల రూపాయల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వానికి వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీ, మద్యం లైసెన్స్‌ల ద్వారా ఆదాయం వస్తోంది. 35,036 కోట్ల రూపాయల విలువైన మద్యం విక్రయాలు జరగ్గా, రాష్ట్రంలో ప్రతీ నెలా సగటున 2,900 కోట్ల రూపాయలకు పైగా నమోదవుతోంది. ఈ మద్యం విక్రయాల ద్వారా ప్రతీ నెలా 1,150 కోట్ల రూపాయల నుండి 1,250 కోట్ల రూపాయలు వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీ ద్వారా 1,450 కోట్ల రూపాయలు వచ్చాయి. సర్కారు ఖజానాకు సగటున నెలకు 2,530 కోట్ల రూపాయల చొప్పున ఆదాయం వచ్చింది. ఈ లెక్కన మొత్తం 31,560 కోట్ల రూపాయలు ప్రభుత్వానికి సమకూరాయి.

రికార్డు స్థాయిలో 42.99 కోట్ల లీటర్ల బీరు అమ్ముడు పోయింది. లిక్కర్ కంటే బీర్లే ఎక్కువగా విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో జరిగిన మొత్తం మద్యం అమ్మకాల్లో 70 శాతం హైదరాబాద్, దాని పరిసర జిల్లాలైన రంగారెడ్డి, మల్కాజిగిరి, నల్లగొండ, మెదక్ జిల్లాల్లోనే జరిగాయి. హైదరాబాద్ జిల్లాలో 3,739.42 కోట్ల రూపాయలు, రంగారెడ్డి జిల్లాలో 8,410 కోట్ల రూపాయలు, నల్లగొండ జిల్లాలో 3,538 కోట్ల రూపాయలు, మల్కాజిగిరి జిల్లాలో 1,326 కోట్ల రూపాయలు, ఖమ్మం జిల్లాలో 2,222 కోట్ల రూపాయలు, మెదక్ జిల్లాలో 2,917 కోట్ల రూపాయలు, ఆదిలాబాద్ జిల్లాలో 1,438 కోట్ల రూపాయలు, కరీంనగర్ జిల్లాలో 2,934 కోట్ల రూపాయలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 2,488 కోట్ల రూపాయలు, నిజామాబాద్ జిల్లాలో 1,652 కోట్ల రూపాయలు, వరంగల్ జిల్లాలో 3,471 కోట్ల రూపాయల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారవర్గాలు వెల్లడించాయి.

## నా ప్రతిష్టను దిగజార్చేందుకు కొందరు సుపారీ తీసుకుంటున్నారు

### వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభంలో ప్రధాని మోడీ

**భోపాల్, ఏప్రిల్ 1:** దేశంలో 11వ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధానిమోడీ మధ్యప్రదేశ్‌లో ప్రారంభించారు. భోపాల్‌నుంచి న్యూఢిల్లీకి ప్రయాణించే ఈ వందేభారత్ 708 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 7.45 గంటల్లోనే చేరుకుంటుందని అధికారుల ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌గా ప్రవేశపెట్టిన ఈరైలును శనివారం రాణి కమలాపతి స్టేషన్‌నుంచి ప్రధానిమోడీ ప్రారంభించారు. రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్, గవర్నర్ మంగుభాయ్‌పటేల్, ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్‌లో నవీన అభివృద్ధి నమూనాకు వందేభారత్ ఒక నిదర్శనమని భారత్‌లోని చిట్టచివరి నగరానికిసైతం ఈ రైలు నడపాలన్న డిమాండ్‌పెరుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పై జోకులు కూడా వేసారు. వందేభారత్‌ను ప్రారంభించడంపై కాంగ్రెస్‌పార్టీ ఏప్రిల్‌ఫూల్‌గా అభివర్ణించినా ఆశ్చర్యపోనవసరం లేదని చమత్కరించారు. గత ప్రభుత్వాల్లో కేవలం ఒక్కకుటుంబమే భారత్‌లో మొట్టమొదటి ఉన్నత కుటుంబంగా చూసేవారని, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను వారు గుర్తించేవారుకాదన్నారు. భారతీయ రైల్వేలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు. భారతీయ రైల్వేలు సామాన్యమానవుని ప్రయాణ సాధనాలని అన్నారు. గడచిన తొమ్మిదేళ్లలో భారతీయ రైల్వేలనుప్రపంచస్థాయిలో ఉత్తమరైల్వేలుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మొత్తం 900 స్టేషన్లలో సిసిటివిలను ఏర్పాటుచేసామని, ఇపుడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రవేశపెట్టడం సూపర్‌హిట్ అయిందన్నారు. కొందరు తన ప్రతిష్టపై బురదజల్లేందుకు సుపారీ తీసుకున్నారని, వారంతా నిత్యం ఇదే పనిలో ఉంటారని అలాంటివి అసలు పట్టించుకోనని అన్నారు. 2014నుంచి కూడా మోడీ ఇమేజ్‌ను దెబ్బతీయాలన్న లక్ష్యంతో కొందరుపనిచేస్తున్నారన్న మోడీ ఇందుకోసం వారు సుపారి కూడా తీసుకుంటున్నారని అన్నారు. రైలులో సుమారు 300 మంది స్కూలు పిల్లలతో మోడీ ముచ్చటించారు. మధ్యప్రదేశ్ రైల్వేలకు బడ్జెట్‌లో 13వేల కోట్లు కేటాయించామని, అంతకుముందు బడ్జెట్ లో 600 కోట్లు మాత్రమే కేటాయింపులుండేవన్నారు. మధ్యప్రదేశ్ ఇపుడు అభివృద్ధిలో దూసుకుపోతోందని ఆయన ప్రశంసించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో కమాండర్ల సదస్సుకు హాజరయ్యేందుకు వచ్చిన మోడీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా ప్రారంభించారు.



## సికిందరాబాద్, తిరుపతి మధ్య వందేభారత్ రైలు

### 8న ప్రారంభించనున్న ప్రధాని: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర పర్యటనకు ఈనెల 8న వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడి తెలుగు రాష్ట్రాల మధ్య సేవలు అందించనున్న రెండవ వందేభారత్ రైలును ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరగనున్న ఈ ప్రారంభోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సికింద్రబాద్-తిరుపతి మధ్యన ఈ రైలు తన సేవలను అందిస్తుందన్నారు. భాగ్యనగరం, హైదరాబాద్, ఆధ్యాత్మిక నగరం తిరుపతికి మధ్యన ప్రయాణించే వారికి అనుకూలంగా ఈ రైలు తన సేవలను అందించనుందని, భాగ్యనగర వాసులకు ఈ అవకాశం కల్పించిన ప్రధానికి కిషన్‌రెడ్డి దన్యవాదాలు తెలిపారు.

## ఈ మూడు నెలలు ఎండలే ఎండలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 1:** ఎండాకాలం మొదలైంది. ఇటీవలే కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు కురిసినా.... మరికొన్ని ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. రాత్రి సమయాల్లో వాతావరణం కాస్త చల్లగా ఉన్నా, మధ్యాహ్నం సమయాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ మరో పిడుగు లాంటి వార్త చెప్పింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ శనివారం తెలిపింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎండలే ఎండలు ఉండనున్నాయి. పలు ప్రాంతాల్లో వేడి గాలులు వీస్తాయని చెప్పింది. బిహార్, జార్కండ్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, బంగాల్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు దక్షిణ, వాయువ్య దేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా అనేక చోట్ల సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశంఉందని ఐఎండీ తెలిపింది. బిహార్, జార్కండ్, ఉత్తరప్రదేశ్, ఒడి శా, బెంగాల్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, హరియాణా రాష్ట్రా ల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే చాన్స్ ఉందని మహాపాత్ర వెల్లడించారు.

### టిఎస్‌పిఎస్సీ వ్యవహారంపై ఎసిబికి కాంగ్రెస్ ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 1:** టిఎస్‌పిఎస్సీలో పేపర్ లీక్‌లో ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల హస్తం కూడా ఉందని, కొందరు ఉద్యోగులు డబ్బులు తీసుకుని పేపర్‌ను అమ్ముకున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ నేతలు ఏసీబీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. పేపర్ లీక్‌లో లక్షలాది రూపాయల డబ్బులు చేతులు మారాయని, ఉద్యోగుల హస్తంపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

### శరత్‌చంద్రారెడ్డికి మధ్యంతర బెయిల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 1:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితుడు శరత్ చంద్రారెడ్డికి బెయిల్ మంజూరు అయింది. తన భార్య అనారోగ్యం కారణంగా బెయిల్ కావాలని ఆయన వేసిన పిటీషన్‌పై విచారించిన రౌస్ ఎవెన్యూ కోర్టు... 4 వారాల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఆయన త్వరలోనే విడుదల కానున్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన లిక్కర్ కేసులో శరత్ చంద్రారెడ్డి కీలక నిందితుడిగా ఉన్నారు. ఆయనకు చెందిన మూడు కంపెనీల ద్వారా రూ.64కోట్లకు పైగా ఇప్పటికే అక్రమంగా సంపాదించినట్లు ఈడీ గుర్తించింది. శరత్ చంద్రారెడ్డి... అరబిందో ఫార్మా కంపెనీలో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. అరబిందో గ్రూపులోని మొత్తం 12 కంపెనీలకు ఆయన డైరెక్టర్‌గా ఉన్నాడు.

### ఎన్‌కౌంటర్ భయంతో పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన దొంగ!



**ముజఫర్‌నగర్, ఏప్రిల్ 1:** ఉత్తర్‌ప్రదేశ్‌లో పలువురు నేరగాళ్లను ఎన్‌కౌంటర్లలో చంపేయడంతో ఓ దొంగ భయపడిపోయాడు. బతి కుంటే బల్సాకు తినైనా బతకొచ్చనుకున్నాడో ఏమో గాని.. జైలు జీవితం గడిపేందుకు సిద్ధపడి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. 'నన్ను క్షమించండి సిఎం యోగీ, నేను ఓ తప్పు చేశాన్ను అని రాసిన ప్లకార్డును తన చేతిలో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అంకూర్ అనే ఆ నిందితుడు మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడే ఓ ముఠాకు చెందినవాడని పోలీసులు తెలిపారు. గ్రామ పెద్దతోపాటు తన కుటుంబసభ్యులను తోడుగా తీసుకెళ్లి పోలీసులు ఎదుట లొంగిపోయాడు. ముజఫర్‌నగర్‌లోని మన్సూర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ లొంగుబాటు జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నేరగాళ్లను నిర్బంధించే క్రమంలో వరుస ఎన్‌కౌంటర్లు జరిగాయి. యోగీ హయాంలో మొత్తం 9000 ఎన్‌కౌంటర్లు జరగ్గా..160మంది అనుమానిత నేరగాళ్లు హతమయ్యారని పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.

## పంట నష్టాల సర్వే సక్రమంగా లేకుంటే కలెక్టర్ల దృష్టికి తెండి

### రైతులకు రైతు స్వరాజ్య వేదిక లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులకు జరిగిన పంట నష్టాలపై ప్రస్తుతం సర్వే జరుగుతోందని, ఇది సక్రమంగా నిర్వహించకపోయినట్లయితే బాధిత రైతులు ఈ విషయాన్ని సంబంధిత జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని రైతు స్వరాజ్య వేదిక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు స్వరాజ్య వేదిక కన్వీనర్ కన్నెగంటి రవి శనివారం ఒక ప్రకటనలో ఇటీవల వర్షాలకు రైతులు పంటలు నష్టపోయారని, అటువంటి వారికి ఎకరానికి 10 వేల రూపాయలు సహాయం అందిస్తామని రాష్ట్ర సర్కార్ ప్రకటించిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు సర్వే చేస్తున్నారని, ఇది ఈ నెల 4వ తేదీ నాటికి పూర్తవుతుందని చెప్పారు. దీన్ని గమనంలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు సర్వేను సరిగా నిర్వహించకపోయినట్లయితే అటువంటి రైతులు, ముఖ్యంగా కౌలు రైతుల వివరాలు రాకపోతే జిల్లా కలెక్టర్‌కు నష్టపోయిన రైతులతో వినతిపత్రం ఇప్పించాలని సూచించారు.

## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హౌస్‌అరెస్టుపై టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్‌లను హౌజ్ అరెస్టులు చేయడంపై టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతులకు అండగా ఉంటాం, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే అరెస్టులతో నిర్భందిస్తారా అంటూ ప్రశ్నించారు.

జీవన్‌రెడ్డి, లక్ష్మణ్ కుమార్ లాంటి ప్రజా నాయకులను నిర్భందిస్తే ప్రజాగ్రహాన్ని చవి చూడాల్సి ఉంటుందన్నారు. ప్రతిపక్ష పార్టీ మండలి నాయకున్ని నిర్భంది స్తారా? జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# స్టార్ హీరోలతో 'ఆస్కార్' విజేత



ఇటీవల మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజ మౌళి, కీరవాణి టీమ్‌ను ఆహ్వానించి ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంగా ఘనంగా సత్కరిం చారు. ఈ తర్వాత కూడ కీరవాణికి , నాటు నాటు టీమ్‌కు ప్రశంసలు సత్కారాలు అందుతూనే ఉన్నాయి. తాజాగా ఆస్కార్ విజేత కీరవాణిని బాలీవుడ్ స్టార్ హీరోలు వెంకటేష్, నాగార్జునకలిశారు. ఇద్దరు స్టార్ హీరోల మధ్య ఆస్కార్ సార్ అంటూ కామెంట్లు విన్పిస్తున్నారు.. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతోంది.

# దసరా విజయదరహాసం



నాచురల్ స్టార్ నాని నటించిన తాజా చిత్రం దసరా విజయం పట్ల యూనిట్‌చాలా సంతోషంగా ఉంది.. మరోవైపు ఈచిత్రం విజయంతో కీర్తి సురేష్ ముఖంలో విజయానందం కన్పిస్తోంది.. దసరా సక్సెస్ వేడుకల్లో భాగంగా హైదరా బాద్‌లో యూనిట్ సభ ఓయలతో కలిసి కీర్తి సురేష్ సందడిచేశారు. ఈసందర భంగా జరిగిన ఈవెంట్ ఆమె చాలా సంతోషంగా కన్పించిందని యూనిట్ తెలిపింది.. ఇందులోని పాత్ర కేవలం కీర్తి సురేష్ మాత్రమే చేయగలదు.. దసరా సినిమా ఈస్థాయిలో విజయాన్ని సొంతం చేసుకునేది కాదు అంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు.

# రాజేంద్రప్రసాద్, అర్చన 'షష్టిపూర్తి'

నటకిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్, నటి అర్చన. ఈజోడీ పేర్లు వింటే లేడీస్ టైలర్ గుర్తుకొస్తుంది.. సుజాతా మై మయర్ జాతా డైలాగును, ఆసన్నివేశాన్ని, ఆసినిమాను అంత త్వరగా ఎవరుమర్చిపోతారు.. చెప్పండి.. తెలుగులో ట్రెండ్ సెట్ చేసిన బ్లాక్‌బస్టర్ సినిమాల్లో అదొకటి.. ఆసినిమా వచ్చిన 37ఏళ్లకు మళ్లీ కాంబినేషన్ రిపీట్ అవుతుంది.. ఓ కొత్త సినిమాలో సూపర్‌హిట్ జోడీ నటిస్తోంది.. రాజేంద్రప్రసాద్, అరచన ప్రధాన పాత్రల్లో మా,., ఎఎ1 ప్రొడక్షన్‌స సంస్థ నిర్మిస్తున్న సినిమా షష్టి పూర్తి, రూపేష్ కుమార్ చౌదరి, ఆకాంక్షాసింగ్ జంటగా నటిస్తున్న



ఈచిత్రానికి పవన్ ప్రభ దర్శకుడు. .రూపేష్‌కుమార్ చౌదరి నిర్మాత. చెన్నైలోని ఇసైజ్ఞానిఇళయరాజా స్టూడియోస్‌లో శనివారం ఈచిత్రంపూజా కార్యక్రమాలతోప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ఇసైజ్ఞాని ఇళయరాజా కెమెరా స్విచ్చాన్‌చేశారు.. సూపర్‌గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్‌బిచౌదరి క్లాప్ ఇచ్చారు.. సినిమా హీరో, నిర్మాత రూపేష్‌కుమార్ చౌదరి మాట్లాడారు.. రాజేంద్రప్రసాద్ ఇళయరాజా వంటి లెజెండ్స్‌తో సినిమాచేసే అవకాశం రావటం సంతోషంగా ఉందన్నారు. లేడీస్ టైలర్ తర్వాత రాజేంద్రప్రసాద్ , అర్చన చేస్తున్నచిత్రమన్నారు. చాలా సంవత్సరాల తర్వాత వాళ్ల కాంబినేషన్ కూడ రిలీజ్ అవుతుందన్నారు. సినిమాలో మొత్తం నాలుగు పాటలున్నాయని తెలిపారు. న్యూఏజ్ ఫ్యామిలీ డ్రామా అనానరు. ఈనెలలో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అవుతుందనానరు. జూలైలో సినిమాను విడుదల చేయటానికి సన్నాహాలుచేస్తున్నామన్నారు. త్వరలోమరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

# 'తెలుగు ఇండియన్ ఐడల్ 2'

సంగీతానికి ఎల్లలు లేని ఒక ప్రపంచ స్థాయి భాష.. అదే నేడు తెలుగు ఇండియన్‌ఐడల్ అనే విశ్వవేదికపై యువగాయకులు తమ ప్రతిభను చాటేందుకు దోహదపడుతోంది.. తెలుగు పాట ప్రపంచం నలుమూలల ఉన్న తెలుగువారి చెవికి చేరుతుంది.. షోలో ప్రస్తుతం ఉన్న టాప్ 11 కంటెస్టెంట్స్ తమ మధురగానంతో ప్రేక్షకుల మదిని దోచుకుంటున్నారు. సామాన్య ప్రేక్షకులే కాక ఎంతో మంది సినీసంగీత ప్రముఖులు వీరి గానానికి మంత్రముగ్ధులవుతున్నారు.. పోటీలో భాగంగా నిర్వహించిన గాలా విత్ బాలా ఎపిసోడ్‌లో సౌజన్య భాగవతుల అనే కంటెస్టెంట్ ఆలపించిన




గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రంలోని ఎంకిమీడ నా జతవిడి.. సాంగ్ విన్న ప్రముఖ నేపథ్యం గాయని శ్రేయాఘోషల్ సంతోషం వ్యక్తం చేశారు. సౌజన్య గాత్రం అత్యంత మధురంగా ఉందంటూ కితాబు నిచ్చారు.. ఈ చిత్రంలో ఒకరిజినల్ పాటను ఆమె శ్రేయానే ఆపలించారు.. అలాగేప్రముఖ బాలీవుడ్ సంగీతకారులు విశాల్ దద్లాని, మరియు హిమేష్ రేషిమియా షోకు వస్తున్న ఆదరణను ప్రశంసించారు. ఈ షో ఇలాగే దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించి, కంటెస్టెంట్స్‌కు ఆల్‌ది బెస్ట్ తెలిపారు. షో గురించి మార్కెటింగ్ హెడ్ కార్తీక్ కనుమూరు మాట్లాడారు.. తెలుగు ఇండియన్ ఐడల్ కంటెసె ంట్స్ తమ గాత్రంతో యూవత్ తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆహా ఓటిటి ఈ షో ద్వారా ప్రతిభావంతులైన గాయకులను ప్రపంచానికి పరిచయంచేయటంలో విజయవంతమవుతుందన్నారు.



# సూపర్‌స్టార్ ఫ్యాన్స్‌కు తీపి కబురు

సూపర్‌స్టార్ మహేష్‌బాబు ప్రస్తుతం కెరీర్ పరంగా వరుసగా సూపర్ సక్సెస్‌లతో దూసుకుపోతున్నారు. వరుసగా భరత్ అనే నేను మహర్షి, సరిలేరు నీకెవ్వరు సినిమాలతో హ్యాట్రిక్ కొట్టిన మహేష్‌బాబు, ఆ తర్వాత వచ్చిన సర్కారువారి పాటతో కూడ సక్సెస్‌న సొంతం చేసుకుని



సెకండ్ హ్యాట్రిక్‌కి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం త్రివిక్రమ్‌తో తన కెరీర్ 28వ సినిమా చేస్తున్నా రు.. సూపర్‌స్టార్ మహేష్‌బాబు, హారికా హాసిని క్రియేషన్స్ సంస్థపై ఎంతో భారీస్థాయిలో నిర్మితం అవుతున్న ఈ మూవీకి థమన్ సంగీతం అందిస్తున్నారు.. పూజాహెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటిం గ్ జరుపుకుంట్ను ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 13న విడుదల చేయనున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. అలాగే మే 31న సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా తమ మూవీ నుంచి నెక్స్ట్ అప్‌డేట్ రానుందని అని కూడ మేకర్స్ తెలిపారు. కాగా మే 31న మూవీ నుంచి సూపర్ అప్‌డేట్ ఖాయం అంటూ తమన్ ట్వీట్టర్ అకౌంట్‌లో డ్రమ్స ఎమోజీ పోస్ట్ చేవారు. దీంతో అదే రోజున టైటిల్‌తోపాటు ఫస్ట్ లుక్ టీజర్ కూడ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.




# త్వరలో రాబోతున్న 'హలో మీరా'

ఒక సినిమా అంటే ఎన్నో రకాలు పాత్రలు, ఎన్నో విభిన్న క్యారెక్టర్లుంటాయి.అలా ఉంటేనే సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని, రెండునరర గంటలుఎంటర్‌టైన్ చేయొచ్చని అంతా అనుకుంటారు.. కానీ పరిమితిమైన పాత్రలతోనూ అద్భు తాలు చేయొచ్చని ఇది వరకు ఎన్నోసార్లు నిరూపిత మైంది.. అయితే ఇపుడు తెలుగు లో మరోప్రయత్నంగా గార్గేయి యల్లాప్రగడ ప్రధానపాత్రలో హలోమీరా అనే సినిమా రాబో తోంది.. ఒకే ఒకపాత్రో సినిమాను తెరకెక్కించటం సాహసమనే చెప్పాలి. ఆ సాహసాన్ని హలో మీరా అంటూ ముందుకు తీసుకొస్తున్నారు.. డైరెక్టర్ కాకర్ల శ్రీని వాసు, ప్రముఖ దర్శకుడు బాపుగారితో పలు సినిమాలకు సహదర్శకుడిగా పనిచేసిన అనుభవాన్ని రంగరించి ఈ హలోమీరా సినిమాతో ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు.. కార్ల శ్రీనివాస్, లూమియర్ సినిమా బ్యానర్‌పై జీవన్ కాకర్ల సమర్పణలో డాక్టర్ లక్ష్మణరావు దిక్కల, వరప్రసాద రావు,దుంపల, పద్మ కాకర్ల నిర్మించారు..



# కుందనపు బొమ్మలా భలే ముద్దుగా...

సంస్కృతి సంప్రదాయాలను ప్రతిభింబించేలా పాటలను, సినిమాలను ప్రేక్షకులు ఎపుడూ గౌరవిస్తారు. ప్రాంతీయ సంస్కృతికి పెద్దపీటవేస్తూ రూపొందుతున్న చిత్రాలకు భారీ విజయాలు అందిస్తున్నారు. తెలుగు సినిమాల్లో తెలంగాణ పండుగ బతుకమ్మ నేపథ్యంలో పాటలు అప్పుడపుడూ వినబడుతున్నాయి.. ప్రేక్షకులను అలరిస్తున్నాయి.. అందులో కొత్తేమీ లేదు.. బాలీవుడ్ సినిమాలో బతుకమ్మ పాట వినబడితే. విశేషమే.. కదా.. బాలీవుడ్ బాయిజాన్ సల్మాన్‌ఖాన్ హీరోగా నటించిన బాలీవుడ్ సినిమా కిసీ కా బాయ్ కిసీ కీ జాన్ ఆయన సరసన బుట్టబొమ్మగా తెలుగు ప్రేక్షకుల హృదయాలు కొల్లగొట్టిన పాన్‌ఇండియాస్టార్ హీరోయిన్ పూజా హెగ్డే హీరోయిన్.. ఈసినిమాలో తెలంగాణ సంస్కృతిలో భాగమైన ఆడబిడ్డల మనసుకు దగ్గరైన బతుకమ్మ పండుగ నేపథ్యంలో పాటను రూపొందించారు. కిసీ కా బాయ్ కిసీకీ జాన్‌లో బతుకమ్మ పాటనునేడు విడుదల చేశారు.. అందులో భలేముద్దు ముద్దుగా పూజా హెగ్డే నృత్యం చేశారు. తెలంగాణ పల్లె సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టేవిధంగా పాటను చిత్రీకరించారు. లంగా ఓణి వేసి , కొప్పులో మల్లెపూలు పెట్టి, మెడ నిడా నగలతో బతుకమ్మ పాటలో పూజా హెగ్డే తెలంగాణ పడుచులా పూజా నృత్యం చేస్తుంటే అలా అలా చూస్తూ ఉండిపోవాలనిపిస్తుంది.. ఫ్యామిలీ స్టార్ విక్టరీ వెంకటేష్, సల్మాన్‌ఖాన్ సాంప్రదాయ దుస్తుల్లో కన్పించటం ఈ పాట ప్రత్యేకత.

### వారితో ఈ పాటలో కన్పించటం ఆనందంగా చాలా ఆనందంగా ఉంది

బతుకమ్మ పాట గురించి బుట్ట బొమ్మ పూజాహెగ్డే మాట్లా డారు.. బతుకమ్మ పర్వదినం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. భారతీయ సంస్కృతిలో పువ్వులను పూజించే గొప్ప పండుగ ఇది.. తెలంగాణ అమ్మాయిలు సంబరంగా చేసుకునే ఎంతో విశిష్టత ఉన్న బతుకమ్మ పండుగ పాటలో నేను కన్పించటం ఆనందంగా ఉంది.. సల్మాన్‌ఖాన్ గారు, వెంకటేష్‌గారు, భూమిక గారితోపాటలో సందడి చేయటం చాలా ఆనందాన్ని ఇచ్చింది.. తెలంగాణ బతుకమ్మ పండగకు మా టీం నుంచి భక్తితో సమర్పించిన కానుక ఇది.. కిసీ కాబాయ్ కిసీ కాజాన్ తెలుగు ప్రేక్షకులు అందిరికీ తప్పక నచ్చుతుందన్నారు.

# ఆగస్టు 16,1947

ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ సమర్పణలో గౌతమ్ కార్తీక్ హీరోగా, ఎస్ఎస్ ఫోన్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ మూవీ ఆగస్టు 16,1947. ఏఆర్ మురుగదాస్ ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏఆర్ మురుగదాస్, ఓం ప్రకాష్ భట్, నర్సిరామ్ చౌదరి భారీ బడ్జెట్, అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించిన ఈచిత్రానికి అదిత్య జోషి సహనిర్మాత.. ప్రుమఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్ ఈ చిత్రాన్నితెలుగులో విడుదలచేస్తున్నారు.. ఏప్రిల్ 14న చిత్రం విడుదల కాబోతున్న నేపథ్యంలో యూనిట్ మీడియాతో మాట్లాడింది. మురుగదాస్ మాట్లాడుతూ, ఆగస్టు16,1947 కథ



చదువుతున్న పుడు చాలా అద్భుతంగాఅన్పించిందన్నారు. కథ చదివినపుడే ఈసినిమానునిర్మించాలని అనుకున్నానని అన్నారు. ఇది చాలా స్పెషల్ మూవీ అన్నారు.. ఆగస్టు 15 దేశచరి త్రలో చాలా ముఖ్యమైన రోజని, ఆగస్టు 14,15,16 ఈ మూడు రోజుల్లో ఓ మార్మూల పల్లెలో జరిగే కథ అన్నారు. చుట్టూ అడవి కొడ ఉన్న ఊరు అన్నారు. ఈచిత్రం అందరికీ నచ్చుతుందని అన్నారు.. ఈసినిమాను విడుదల చేస్తున్న మధు, ప్రసాద్ గార్లకు ధన్యవాదాలు అన్నారు. కార్యక్రమంలో గౌతమ్ కార్తీక్, దర్శకుడు ఫోన్‌కుమార్, మధు తదితరులుమాట్లాడారు.

# ఓటిటిలోకి వచ్చిన అమిగోస్

నందమూరి టాలెంటెడ్ హీరో నందమూరి కళ్యాణ్‌రామ్ హీరోగా ఆశికా రంగనాథ్ హీరోయిన్‌గా దర్శకుడు రాజేంద్రరెడ్డి తెరకెక్కించిన చిత్రం ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ అమిగోస్ తెలిసింది. ఈసినిమాను చూసినవారికి చాలా బాగా నచ్చింది.. ఇక ఈసినిమా ఓటిటి స్ట్రీమింగ్‌కు చాలా సమయం తీసుకుందని చెప్పాలి... ఈసినిమా స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటిటి సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా, ఇందులో ఈచిత్రం



శనివారం నుంచి అందుబాటులోకి వచ్చింది.. ఈ సాలిడ్ సినిమాకు జిబ్రాన్ సంగీతం అందించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం వహించారు.



న్యూఈవెంట్ పిక్: తాజాగా సిటీలో జరిగిన కార్యక్రమంలో యంగ్ హీరోయిన్ పూజిత పొన్నాడ



# రోజంతా తాజాగా, ఉల్లాసంతో..

**ఒకవైపు వేడి, మరోవైపు చెమటతో చిరాకు, రోజంతా విసుగ్గా అనిపిస్తుంటే ఉల్లాసం ఎక్కడినుంచి వస్తుంది? దీన్ని తరిమికొడుతూ తాజాగా కనిపించాలనుందా? ఈ చిట్కాలు పాటించేయమంటున్నారు నిపుణులు.**

❖ రోజుకు రెండుసార్లు స్నానం ఈ కాలం తప్పనిసరి చేసుకోండి. వేడిని తరిమికొట్టాలని పూర్తిగా చల్లటి నీటిని మాత్రం ఆశ్రయించొద్దు. చర్మం నిర్జీవంగా తయారవుతుంది. గోరు వెచ్చని నీటితో స్నానం చేసి.. చివర్లో రెండు మగ్గులు చల్లని నీరు పోసుకోండి. శరీర వేడి తగ్గడమే కాదు.. చాలాసేపు తాజా అనుభూతీ కలుగుతుంది.

❖ చలి లేదు.. చర్మం పగిలే సమస్య ఉండదని మాయిశ్చరైజర్ పక్కన పెట్టేశారా? వేడికి అతుక్కున్నట్టుగా ఉంటుందనీ కొందరు రాయడానికి ఇష్టపడరు. కానీ మాయిశ్చరైజర్ చర్మంలో తేమను లాక్ చేస్తుంది. కాబట్టి, స్నానం పూర్తవగానే తప్పక రాయాలి. సిట్రస్ గుణాలున్నది ఎంచుకుంటే తాజాగానూ అనిపిస్తుంది.

❖ చెమటకి జుట్టూ అతీతం కాదు. అదనంగా జిడ్డుగానూ మారుతుంది. స్టైల్ కోసమని జుట్టు విరబోయొద్దు. గడ్డిలా తయారవడమే కాదు. మెడ మీద చెమటకీ దారితీస్తుంది. పోనీటెయిల్, ముడి లేదా జడలా కట్టేసుకోండి.

❖ ఈ కాలంలో ఒంట్లోని నీరంతా స్ట్రా వేసి పీల్చినట్టుగా ఆవిరై పోతుంది. కాబట్టి, ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలను తీసుకోండి. తాజా పండ్లను తరచూ తీసుకుంటుంటే తేలిగ్గా అరగడమే కాదు.. కావాల్సిన పోషకాలన్నీ శరీరానికి అంది హుషారుగానూ ఉంటారు.

❖ చల్లని పదార్థాలవైపు ఈ కాలం మనసు మళ్లుతుందన్న మాట నిజమే! కానీ.. ఒత్తిడి కొద్దో, అలవాటు రీత్యానో టీ, కాఫీలు తరచూ తీసుకునేవారూ ఎక్కువే. సోడా, కూల్‌డ్రింక్‌లు, టీ, కాఫీలు శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తాయి. పరిమితంగా తీసుకోవడమో.. వీలుంటే పూర్తిగా పక్కన పెట్టేయడమో చేయండి.

❖ స్టైల్ కంటే సౌకర్యానికి ప్రాధాన్యమివ్వండి. వదులుగా, మెత్తగా ఉన్న దుస్తులు శరీరానికి హాయిని కలిగిస్తాయి. లేత రంగును ఎంచుకుంటే వేడిని పెద్దగా ఆకర్షించవు. దీంతో శరీరమూ చల్లబడుతుంది.



# కేన్సర్ బాధిత చిన్నారులకు చేయూత

**రోడ్డువారన ఎండలో చికిత్స కోసం ఎదురుచూస్తున్న క్యాన్సర్ బాధిత చిన్నారుల దుస్థితి చూసి ఆ దంపతుల మనసు చివుక్కుమంది. సాయం అందించాలనుకున్నారు. దేశవ్యాప్తంగా క్యాన్సర్ ఆసుపత్రులున్న నగరాల్లో వీరికి బస, పోషకాహారం, చికిత్సకు చేయూత అందేలా చూస్తున్న శ్యామ, నిహాల్ కవిరత్నే దంపతుల స్ఫూర్తి తెలుసుకుందాం.**

శ్యామ భర్త నిహాల్ కవిరత్నే విదేశంలో యూనిలివర్ సంస్థలో పదవీ విరమణ పొంది స్వదేశానికి బయలుదేరారు. ఈ జంట ముంబయికి చేరుకున్నప్పుడు దారిలో ఓ చోట పెద్ద ఎత్తున జనాన్ని చేశారు. ఆరా తీస్తే టాటా మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన చిన్నారులు, వారి కుటుంబాలని తెలిసింది. రోడ్డుమీద ఎండను కూడా లెక్క చేయకుండా అలా పడిగాపులు కాస్తున్న వారిని చూసి ఆ దంపతుల మనసు వేదనతో నిండిపోయింది. గ్రామీణ ప్రాంతాల నుంచి తమ పిల్లలకు క్యాన్సర్ చికిత్స చేయించడానికి వచ్చారని, బస లేక అలా రోడ్డుమీదే ఉంటారని తెలిసింది. అటువంటి వారికి చేయూతనందించాలని నిశ్చయించుకున్నారా దంపతులు. 2006లో టాటా ఆసుపత్రికి సమీపంగా మొదటి సెయింట్ జూడ్ ఇండియా చైల్డ్‌కేర్ సెంటర్ ప్రారంభించారు. ఇందులో ఎనిమిదిమంది చిన్నారులకు తొలిసారిగా తమ కుటుంబసభ్యులతో బస సౌకర్యాన్ని పొందారు. చికిత్స జరిగినంద కాలం ఇక్కడే ఉండేలా ఏర్పాటులతోపాటు వారికి అవసరం అయిన పోషకాహారాన్ని అందేలా చేశారు శ్యామ, నిహాల్ దంపతులు.

**దేశ వ్యాప్తంగా......** ముంబయిలో ప్రారంభమైన వీరి సేవలు ఈ 17 ఏళ్లలో తొమ్మిది నగరాల్లో 39 కేంద్రాలకు విస్తరించాయి. బసతోపాటు క్యాన్సర్ బాధిత చిన్నారులకు అవసరమయ్యే మౌలికసేవలనూ అందిస్తున్నామంటారు శ్యామ. ఈ పిల్లలకు విద్యతోపాటు మానిసికారోగ్యం పెంపొందేలా కృషి చేస్తున్నాం. క్యాన్సర్ చికిత్స సమయంలో పోషకాహారం తీసుకుంటేనే వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే పోషక విలువలున్న ఆహారంతోపాటు సహబృందంతో కలిసి చర్చలు, రకరకాల ప్రయోగాలు చేపట్టడం, మనసుకు నచ్చిన ఆర్ట్ లేదా క్రాఫ్ట్ చేయడంలో ప్రోత్సహిస్తున్నాం. ఛార్ట్‌లు, పోస్టర్స్ రూపొందించడం, హోంవర్క్ షీట్స్‌నెలా నింపాలో నేరుతాం. క్విజ్, నాటకాలు కంప్యూటర్ శిక్షణ సహా కౌన్సెలింగ్ ఉంటాయి. వీటన్నింటికీ ఉపాధ్యాయులున్నారు. తమకున్న వ్యాధి నయమవుతుందో లేదో ఆలోచనలో ఒత్తిడి. ఆందోళనకు గురికాకుండా ఇవన్నీ చేస్తున్నాం. చికిత్స ముగిసేలోపు ఎటువంటి భావోద్వేగాలకు వీరు లోనుకారు ఆ తర్వాత నెమ్మదిగా జనజీవన స్రవంతిలో తేలికగా కలవగలుగుతారు అంటారీమె.





**ఆసుపత్రులతో....** క్యాన్సర్ ఆసుపత్రులకు సమీపంలో ఏర్పాటు చేసే ఈ కేంద్రాలన్నీ ఆసుపత్రులతో కలిసి పనిచేస్తాయి. ఇప్పటివరకు దాదాపు 18వేల మంది వీరి సేవలను అందుకున్నారు. ప్రతి చిన్నారికి చికిత్స అందే రెండేళ్లలో ఇక్కడికొచ్చి వెళుతుంటారు. ఇక్కడే ఉంటూ ఆసుపత్రికి వెళ్లి వస్తారు. ఆ సమయంలో వారి రవాణా ఖర్చులు, మందులు మేమే భరిస్తాం. ఈ సేవలో మాతోపాటు బార్‌క్లేస్, మహానగర్ గ్యాస్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, సిటీబ్యాంక్, అజీం ప్రేమజీ ఫౌండేషన్ వంటి సంస్థలు విరాళాలనందించి సహకరిస్తున్నాయి. అంటున్న శ్యామ దంపతులు మరెందరికో స్ఫూర్తినందిస్తున్నారు. ❑

# వ్యర్థాలను తొలగించేస్తాయి..

జీవన శైలి, ఒత్తిడి ఇలా పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు నానాటికీ పెరుగుతున్నాయి. ఎండలూ ఎక్కువవడంతో మరింత అప్రమత్తంగా ఉండాలి. మూత్రపిండాలని ఆరోగ్యంగా ఉంచే పోషకాహారమిది..

**పునర్నవ...** ఈ ఆకుకూర కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచి, మెరుగ్గా పనిచేయటానికి కావాల్సిన పోషణనిస్తుంది.

**ఆల్‌బుకరా పండ్లు..** దీనిలోని యాంటీలిథోజెనిక్ గుణాలు కిడ్నీల్లో రాళ్ల ఏర్పడకుండా కాపాడతాయి. వీటిని నేరుగా తినొచ్చు. లేదా సలాడ్లు, ఓట్‌మీల్‌లో వేసుకొని తినవచ్చు. తరచూ వీటిని తీసుకోవటం వల్ల పొట్టలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది జీర్ణక్రియ మెరుగుపడు తుంది.



**తిప్పతీగ...** ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు శరీరంలోని మలినాలను తొలగించి మూత్రపిండాలు పాడవకుండా చేస్తాయి.

**అల్లం..** ఇంట్లో తేలిగ్గా దొరకే అల్లం కిడ్నీలకు మేలు చేకూర్చడంలో ముందుంటుంది. ఇది వాపు తగ్గిస్తుంది. ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే నొప్పినీ మటుమాయం చేస్తుంది.

**త్రిఫల...** దీన్ని కషాయంలా తాగొచ్చు. రాత్రివేళల్లో పాలు లేదా తేనెతో కలిపి తీసుకుంటే ఫలితం కలిపిస్తేంది.

## చెలీ చిట్కా



**ఎంబ్రాయిడరి, అద్దం వర్క్ చేసిన దుస్తులను వాషింగ్ మెషిన్‌లో ఉతకాలంటే వాటి అందం, మెరుపు పోతుందేమోనని భయపడు తున్నారా? ఇలా చేసి చూడండి. ఓ దిండు గలేబులో దుస్తులు చుట్టి అప్పుడు వాషింగ్ మెషిన్‌లో వేయండి.** ❑

# నచ్చిన వృత్తినే ఎంచుకుందాం. !

ఎంత బాగా చదివినా సరే.. కెరియర్‌ను ఎంచుకునే విషయంలో మనలో చాలామంది తడబడుతుంటారు. అటువంటప్పుడు చేరిన ఉద్యోగం నచ్చక, మరే మార్గం కనిపించక ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి పరిస్థితిని అధిగమించడానికి కెరియర్ పర్సనాలిటీ టెస్టులు ఉపయోగపడతాయి. అందరికీ ఒకే రకమైన వృత్తి నైపుణ్యాలు ఉండవు. ఒక పనిని అందరూ ఒకేలా చేయలేరు. విజయవంతమైన, స్థిరమైన వృత్తి జీవితం ఉండటం ఎంతో ముఖ్యం. వృత్తి జీవితంలో విజయం పొందలేని వారు వ్యక్తిగత జీవితంలోనూ సంతృప్తిగా లేనట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి మనవ్యక్తిత్వానికి, నైపుణ్యాలకు తగ్గట్టు అవకాశాలను అందిపుచ్చుకోవటం మనం ఏ వృత్తికి సరిపోతామో అంచనా వేస్తాయి. ఇలాంటి పరీక్షలు నిర్వహించే సంస్థలను ఆన్‌లైన్లో వెతికి ఉత్తమమైన వాటిని ఎంచుకోవచ్చు. తద్వారా ఉద్యోగాన్ని చేపట్టి వృత్తి జీవితంలో ఉన్నతంగా ఎదుగుదాం. ❑



# చేప రుచులు

**చేపల పులుసు ఘుమఘుమలాడుతూ నోరూరించినా ఎప్పుడూ అదే తినలేం కదా.. అందుకే ఈసారి చేపల కూరల్ని ఈ రుచుల్లో వండేద్దామా.**

## మసాలా కర్రీ

**కావలసినవి :** చేప ముక్కలు : ఏడు, వాము : పావ్వావుచెంచా, సెనగపిండి : టేబుల్ స్పూను, కారం : మూడు చెంచాలు, పసుపు : చెంచా, అల్లంవెల్లుల్లిముద్ద : చెంచా, నిమ్మరసం : చెంచా, ఉప్పు : తగినంత, నూనె : పావుకప్పు, పెరుగు : పావుకప్పు, కరివేపాకు : రెండు రెబ్బలు, జీడిపప్పు : పావుకప్పు (ననాబెట్టుకుని ముద్దలా చేసుకోవాలి), టొమాటో గుజ్జు : టేబుల్ స్పూను, ఉల్లిపాయ : ఒకటి, నెయ్యి : రెండు చెంచాలు, ఉప్పు : తగినంత అల్లం ముద్ద : చెంచా.



**తయారీ విధానం :** చేప ముక్కల్ని శుభ్రం చేసి వాటికి ఉప్పు పట్టించి పెట్టుకోవాలి. ఓ గిన్నెలో అల్లంవెల్లుల్లి ముద్ద, నిమ్మరసం, పావుచెంచా వాము, సెనగపిండి, చెంచా కారం, సగం పసుపు వేసి కలిపి ఈ మిశ్రమాన్ని చేప ముక్కలను పట్టించి అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. స్టౌమీద బాణలి పెట్టి నూనె వేసి అందులో చేపముక్కల్ని వేయించుకుని తీసుకోవాలి. ఓ గిన్నెలో పెరుగు, జీడిపప్పు ముద్ద, టొమాటో గుజ్జుజ, మిగిలిన కారం, పసుపు, పావుకప్పు నీళ్లు పోసి కలుపుకోవాలి. స్టౌమీద బాణలి పెట్టి నెయ్యి వేసి మిగిలిన వాము వేసి వేయించి ఉల్లిపాయముక్కలు వేయాలి. అవి వేగాక అల్లంముద్ద పెరుగు మిశ్రమం, కరివేపాకు వేసి మరిగించాలి. మిశ్రమం దగ్గరగా అయ్యాక తగినంత ఉప్పు, చేప ముక్కలు వేసి బాగా కలిపి దింపేయాలి.

## గోవన్ షిష్ కర్రీ



**కావలసినవి :** చేప ముక్కలు : అరకేజీ, ధనియాలు : రెండు చెంచాలు, జీలకర్ర, చెంచా, ఆవాలు : అరచెంచా, వెల్లుల్లి రెబ్బలు : మూడు, కొత్తిమీర, కట్ట, అల్లంతరుగు : టేబుల్ స్పూను, ఉప్పు: తగినంత, మిరియాలు : అరచెంచా, కారం : అరచెంచా, పసుపు : అరచెంచా, నూనె : టేబుల్‌స్పూను, ఉల్లిపాయ: ఒకటి , టొమాటో : ఒకటి, చింతపండురసం : రెండు చెంచాలు, కొబ్బరిపాలు : కప్పు

**తయారీవిధానం :** స్టౌమీద బాణలి పెట్టి ధనియాలు, జీలకర్ర, ఆవాలు వేయించాలి. వీటితోపాటై వెల్లుల్లి రెబ్బలు, కొత్తిమీర, అల్లంతరుగు, తగినంత ఉప్పు, మిరియాలు, కారం, పసుపు మిక్సీలో వేసి కాసిని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. స్టౌమీద బాణలి పెట్టి నూనె వేసి ఉల్లిపాయముక్కలు వేయించాలి. అవి మేగాక చేసి పెట్టుకున్న మసాలా వేసి కలపాలి. నిమిషమయ్యాక టొమాటో ముక్కలు కూడా వేయించి, చేప ముక్కలు, చింతపండు రసం వేయాలి. ఆ ముక్కలు ఉడుకుతున్నప్పుడు కొబ్బరిపాలు పోయాలి. కూర చిక్కగా అయ్యాక దింపేయాలి.

## టిక్కా మసాలా

**కావలసినవి :** ముల్లులేని చేప : అరకేజీ, నిమ్మరసం : రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు : తగినంత, కారం: మూడు చెంచాలు, అల్లంవెల్లుల్లి ముద్ద : నాలుగు చెంచాలు, పెరుగు : పావుకప్పు సోంపు : అరచెంచా, మెంతులు : చెంచా, వెన్న : రెండు చెంచాలు, క్రీమ్ : అరకప్పు, టొమాటో గుజ్జు : అరకప్పు, కొత్తిమీర : అలంకరణకోసం, చాట్‌మసాలా: చెంచా, సెనగపిండి: రెండు చెంచాలు.



**తయారీ విధానం :** ఓ గిన్నెలో చేప ముక్కలు, నిమ్మరసం, కొద్దిగా ఉప్పు, చెంచా కారం, చెంచా అల్లంవెల్లుల్లి ముద్ద, సెనగపిండి, పెరుగు, సోంపు తీసుకుని అన్నింటినీ కలిపి అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. స్టౌమీద పాన్ పెట్టి నూనె వేస్తూ ఈ ముక్కల్ని ఎర్రగా వేయించి తీసుకోవలి. అదే స్టౌ మీద బాణలి పెట్టి మిగిలిన నూనె వేసి ఉల్లిపాయముక్కలు వేయించాలి. ఇందులో మెంతుపొడి, జీలకర్రపొడి, పసుపు, మిగిలిన కారం, టిక్కా మసాలా, చాట్‌మసాలా, తగినంత ఉప్పువేసి బాగా కలపాలి. తరువాత టొమాటో గుజ్జు, చేపముక్కలు వేసి కలిపి, వెన్న, క్రీమ్ వేసి రెండు నిమిషాలయ్యాక దింపేసి కొత్తిమీర చల్లాలి.

## మంచూరియా కర్రీ ..

**కావలసినవి :** చేప ముక్కలు : రెండు కప్పులు, నూనె : వేయించేందుకు సరిపడా, మైదా : ముప్పావుకప్పు, మొక్కజొన్నపిండి : పావుకప్పు, ఉప్పు : తగినంత, మిరియాలపొడి : రెండు చెంచాలు, సోయాసాస్: రెండు చెంచాలు, గ్రేవీకోసం : అల్లంవెల్లుల్లి ముద్ద : టేబుల్‌స్పూను, ఉల్లిపాయ: ఒకటి, పచ్చిమిర్చి : రెండు : టొమాటో: ఒకటి, చక్కెర: చెంచా, ఎండుమిర్చి ముద్ద : టేబుల్‌స్పూను, గ్రీన్ చిల్లీసాస్, చెంచా, టొమాటో కెచప్ : టేబుల్‌స్పూను, మొక్కజొన్నపిండి: టేబుల్‌స్పూను (నీళ్లతో జారు పిండిలా కలపుకోవాలి), కొత్తిమీర : కట్ట

**తయారీ విధానం :** ఓ గిన్నెలో మైదా, మొక్కజొన్నపిండి, కొద్దిగా ఉప్పు, చెంచా మిరియాలపొడి, చెంచా సోయాసాస్ వేసి, నీళ్లు పోస్తూ చిక్కని పిండిలా చేసుకోవాలి. ఇందులో చేప ముక్కల్ని ముంచి.. కాగుతోన్న నూనెలో వేసి ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. బాణలిని స్టౌమీద పెట్టి రెండు చెంచాల నూనె వేయాలి. అది వేడయ్యాక అల్లం వెల్లుల్లి ముద్ద, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. నిమిషమయ్యాక టొమాటో ముక్కలు కూడా వేయించి, తగినంత ఉప్పు, చక్కెర, ఎండుమిర్చి ముద్ద, మిగిలిన సోయాసాస్, గ్రీన్‌చిల్లీసాస్, టొమాటో కెచప్, వేసి అరకప్పు నీళ్లు పోయాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు మొక్కజొన్న పిండి, మిరియాలపొడి. ఇది చిక్కగా అవుతున్నప్పుడు వేయించుకున్న చేపముక్కలు వేసి కలిపి కొత్తిమీర చల్లి దింపేయాలి. ❑



# తప్పులను సరిచేసుకోవాలి..

## అంతర్వాణి

'అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు, వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును' (సామె 28:13). 'ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును' (సామె 14:12). మనం పొరపాట్లను చేస్తుంటాం. తప్పులు చేయనివారు ఎవరూ లేరు, నీతిమంతులు ఒక్కరైనా లేరు. అయితే కొందరు తమ తప్పిదాలను తెలుసుకుని, పశ్చాత్తాపంతో క్షమాపణలు వేడుకుని, తమ ఆధ్యాత్మిక జీవితంలో ముందుకు సాగిపోతారు. మరికొందరైతే తమ తప్పిదాలకు ఏమాత్రం పశ్చాత్తాపం చెందకుండా, గర్వంతో విర్రవీగుతుంటారు. అంతేకాదు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు బైబిల్‌లోని తమకు అనుకూలమైన వాక్యాలను వెతుక్కుంటారు. తమ పొరపాట్లను సమర్థించుకుంటారు. ఏమాత్రం మనసులో బాధ అనే భావాలే లేకుండా, తమ ఆధ్యాత్మిక జీవితంలో ముందుకు సాగిపోవాలని తపిస్తుంటారు. ఇలాంటివారికి దేవుడు ఏమాత్రం సమీపంగా ఉండడు. దేవుడితో తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నాం అనుకుంటారు, కానీ అది వారి భ్రమ మాత్రమే. నిజంగా దేవుడిని వెంబడించేవారు, ఆయనపై ఆధారపడి, ఆయనతో పెనవేసుకుని జీవించేవారు తప్పు చేసినప్పుడు వెంటనే క్షమాపణలు వేడుకుంటారు. ఎవరినైనా తమ తొందరపాటుతనమో లేక ఉప్పొంగే భావోద్వేగాల వల్లనో తప్పులు చేస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'క్షమాపణ'లు వేడుకుంటారు. దేవుడిని కూడా క్షమించమని అడుగుతారు. ఒక చిన్న తప్పు చేసినా మనసాక్షి గద్దిస్తుంది. పరిశుద్ధాత్మ ద్వారా వారు ప్రేరేపించబడి, మనుషులతోను, దేవుడితోను తమ పొరపాట్లను సరిదిద్దుకుని, మేలైనా ఆధ్యాత్మిక జీవితంలో పయనిస్తారు. అవును మనకు మనలో ఏ లోపం కనిపించదు. మనం చేస్తున్నది అంతా కరెక్ట అని అనుకుంటాం. కానీ మన నీతినిబట్టి మనల్ని మనమే తీర్పు తీర్చుకోకుండా, దేవుడి నీతిలో మనల్ని మనం పరీక్షించుకోవాలి. అప్పుడే మన తప్పిదాలు, పొరపాట్లను గ్రహించి, వారిని సరిచేసుకుంటాం. కాబట్టి తమకు తామే గొప్పవారమని విర్రవీగేవారు ఎవరైనా చివరికి నాశనకూపంలో పడిపోతారు. తప్పిదాలను ఒప్పుకుని, వాటిని విడిచిపెడితే దేవుడి కనికరాన్ని పొందగలం. అట్టి వారు ఎల్లప్పుడూ ఆనందంగా జీవిస్తారు.



-పి.వాణిపుష్ప

# మొహాలీమ్యాచ్‌కు వర్షం అంతరాయం

## డక్‌వర్త్‌లూయిస్ పద్ధతిలో పంజాబ్ జట్టు విజయం



**మొహాలి:** ఐపిఎల్‌సీజన్‌లో రెండో మ్యాచ్‌లో పంజాబ్‌కింగ్స్ బోణీ కొట్టింది. కోల్‌కత్తా నైట్‌రైడర్స్‌తోజరిగిన మ్యాచ్‌లో పంజాబ్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన కోల్‌కత్తా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లనష్టానికి 191 పరుగుల భారీ స్కోరుచేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో కోల్‌కత్తా తడబడింది. 16 ఓవర్లకు ఏడు వికెట్లు నష్టపోయి 146 పరుగులుచేసింది. తర్వాత భారీ వర్షం కురవడంతో ఆటను నిలిపివేసారు. తిరిగి మ్యాచ్‌నిర్వహణ సాధ్యం కాకపోవడంతో డక్‌వర్త్‌లూయిస్ పద్ధతిలో పంజాబ్‌ను విజేతగా ప్రకటించారు.

192 పరుగుల లక్ష్యంతోబరిలోకి దిగిన కోల్‌కత్తాకు ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే భారీ షాక్ తగిలింది. అర్షదీప్‌బౌలింగ్‌లో మన్‌దీప్‌సింగ్ రెండు, అనుకుల్‌రాయ్ నాలుగుపరుగులకే ఔట్ అయ్యారు. నిలకడగా ఆడుతున్న రెహ్మానుల్లా 22ను నాథన్ ఎల్లిస్ క్లీన్‌బౌల్డ్‌చేసాడు. ఆండ్రూ రస్సెల్ 19 బంతుల్లో 35 పరుగులుచేయగా వెంకటేశ్ అయ్యర్ 34పరుగులుచేసాడు. నితీష్‌రాణా 24 పరుగులతో స్కోరును ముందుకు నడిపారు. పంజాబ్‌బౌలర్లలో అర్షదీప్‌సింగ్ మూడు, సామ్‌కరన్, నాథన్ ఎల్లిస్, సికిందర్‌రజా, రాహుల్‌చాహర్‌లు తలో వికెట్ తీసారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌చేసినపంజాబ్ జట్టులో భానుక రాజపక్స 50 పరుగులుచేసాడు. 32 బంతుల్లో ఐదుఫోర్లు, రెండు సిక్స్‌లు కూడా రాబట్టాడు. శిఖర్‌ధావన్ 29 బంతుల్లో ఆరుఫోర్లతో 40 పరుగులుచేసి రాణించారు. జితేశ్‌శర్మ 21, ప్రభ్‌సిమ్రాన్‌సింగ్ 23 పరుగులతో పర్వాలేదనిపించారు. చివరిలో శామ్‌కరన్17 బంతుల్లో 26 పరుగులుచేసారు. షారూక్‌ఖాన్ 11పరుగులతో పర్వాలేదనిపించాడు. కోల్‌కత్తా బౌలర్లలో టిమ్‌సౌథీ రెండు వికెట్లు తీస్తే ఉమేష్‌యాదవ్, వరుణ్‌చక్రవర్తి, సునీల్‌నరైన్ తలో వికెట్‌తీసారు.



## కోహ్లీ రికార్డు సమంచేసిన గబ్బర్

**మొహాలి:** ఐపిఎల్ 16వసీజన్‌లో రెండో మ్యాచ్‌గా జరిగిన పంజాబ్‌కింగ్స్ వర్సస్ కెకెఆర్ మ్యాచ్‌లో పంజాబ్‌కింగ్స్ కెప్టెన్ శిఖర్‌ధావన్ ఆకట్టుకున్నాడు. 40 పరుగులతో ధావన్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. పంజాబ్ 191 పరుగుల భారీ స్కోరుచేయడంలో తన వంతుపాత్రపోషించాడు. భానుక రాజపక్సతో కలిసి రెండో వికెట్‌కు 86 పరుగులు జోడించాడు. ఈనేపథ్యంలో శిఖర్‌ధావన్ తన పేరిట అరుదైన రికార్డును లిఖించుకున్నాడు. ఐపిఎల్ చరిత్రలో అత్యధికసార్లు 50 ప్లస్ భాగస్వామ్యాలుసాధించిన క్రికెటర్‌గా ధావన్‌నిలిచాడు. ఐపిఎల్‌లో ధావన్‌కు ఇది 94వ అర్ధశతకం భాగస్వామ్యం. ఈ క్రమంలో కోహ్లీరికార్డును ధావన్ సమంచేసాడు. ఆర్సీబీ తరపున కోహ్లీకూడా 94 అర్ధశతక భాగస్వామ్యాలు అందించాడు. ఇక అత్యధిక 50 ప్లస్ భాగస్వామ్యాయలలో ఈ ఇద్దరు తొలిరెండు స్థానాల్లో ఉంటే మూడోస్థానంలో సురేష్‌రైనా 83 అర్ధశతక భాగస్వామ్యాలు తెచ్చాడు. డేవిడ్‌వార్నర్ 82.50ప్లస్ భాగస్వామ్యంతో నాలుగోస్థానంలో ఉన్నాడు. ఇక 29 బంతుల్లో 40 పరుగులుచేసి ధావన్ ఇన్నింగ్స్‌లో ఆరుఫోర్లున్నాయి.

## ఇంపాక్ట్ ప్లేయర్‌పై అవగాహన నిల్!



**మొహాలి:** ఐపిఎల్ సీజన్‌నుంచే బిసిసిఐ కొత్తగాప్రవేశపెట్టిన ఇంపాక్ట్‌ప్లేయర్‌నిబంధనను అర్థంచేసుకోవడంలో రెండు జట్లు విఫలం అయ్యాయి. మొహాలి మ్యాచ్‌లో కోల్‌కత్తా నైట్‌రైడర్స్, పంజాబ్‌కింగ్స్ జట్లకు ఈ నిబంధన అర్థంకాలేదు. ఈ మ్యాచ్‌లో ఆడే ప్లేయింగ్ 11తో పాటు ఐదుగురు ప్రత్యామ్నాయ ప్లేయర్ల జాబితానుకూడా రెండుజట్ల కెప్టెన్లు అందచేసారు. ఇక్కడే పంజాబ్, కోల్‌కత్తా జట్లు తప్పు చేసాయి. ఇంపాక్ట్‌ప్లేయర్ పేరు కచ్చితంగా ఈ జాబితాలో ఉండాలి. విదేశీ ప్లేయర్‌ఉన్నా ఆతడిని ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తీసుకునే వీల్లేదు. ఈ విషయం మరిచిన కోల్‌కత్తా,పంజాబ్‌జట్లు ప్లేయింగ్ 11లో నలుగురు విదేశీ ప్లేయర్లను తీసుకున్నప్పటికీ ఐదురు జాబితాలో ఓ విదేశీ ప్లేయర్‌ను చేర్చాయి. దాంతో ఇరుజట్లు ఆ విదేశీ ప్లేయర్‌నే ఇంపాక్ట్‌గా తీసుకోడానికి ఛాన్స్‌లేకుండా పోయింది. కోల్‌కత్తా తుదిజట్టులోకి రహ్మతుల్లా గుర్బాజ్, ఆండ్రీ రసెల్, సునీల్‌నరైన్, టిమ్‌సౌథీ రూపంలో విదేశీ ప్లేయర్లున్నారు. అయినా ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తీసుకునే ఛాన్స్ లిస్టులో డేవిడ్ వైస్‌ని చేర్చింది. అలాగే పంజాబ్‌జట్టు కూడా భానుక రాజపక్సె, సికందర్‌రజా, శామ్‌కరన్; నాథన్ ఎలిస్ రూపంలో నలుగురు విదేశీ ప్లేయర్లకు చోటిచ్చింది. అలాగే ఐదుగురు సబ్‌స్టిట్యూట్ జాబితాలో మాథ్యూ షార్ట్‌నిచేర్చింది. దాంతో డేవిడ్‌వైస్, మాథ్యూషార్ట్‌ను ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తీసుకునే ఛాన్స్ రెండుజట్లు కోల్పోయాయి. ఇంపాక్ట్‌ప్లేయర్ రూపంలో విదేశీ ఆటగాడి స్థానంలోమరో విదేశీ క్రికెటర్‌ను తీసుకోడానికి వీల్లేదు. ఇకవేళ తీసుకుంటే అప్పుడు ఐదుగురు విదేశీ ప్లేయర్లని ఆడించినట్లు అవుతుంది. ఇది ఐపిఎల్ బేసిక్‌రూల్‌కు విరుద్ధం.



## 15 యేళ్లనాటి దూకుడు ఇప్పుడు ఉంటుందా?

### ధోనీ పట్ల విషప్రచారం అన్న కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్

**ముంబయి:** ఐపిఎల్ సీజన్‌ను చెన్నై ఓటమితో షురూచేసింది. మ్యాచ్‌లో కెప్టెన్‌ధోనీ బ్యాటింగ్‌లో దూకుడుగా ఉన్నప్పటికీ కీపింగ్‌లో గతంలో వేగం కొంత తగ్గిందన్న ప్రచారం వెలుగులోకి రావడంతో సీఎస్కేకోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పందించాడు. 15 ఏళ్లకిందట ఉన్న సత్తా ఇప్పటికీ కొనసాగదు కదా అంటూ ధోనీ నిరంతరం ఆడుతూనే ఉంటాడు. అయితే ఆతడిలో వేగం లేదనే వార్తలు ఎక్కడినుంచి వస్తున్నాయో అర్థం కావడంలేదు 15 ఏళ్లకిందట ఉన్న దూకుడు ఇప్పుడు ఎలా ఉంటుందని ప్రశ్నించాడు. ఈసీజన్‌ప్రారంభానికి ముందు వరకూ మోకాలి నొప్పితో భాధపడ్డాడు. కానీ ఈ మ్యాచ్‌లో కాలు తిమ్మిరి ఎక్కింది. మోకాలు నొప్పికాదు. ఆతడు 15 ఏళ్లకిందట ఎంత వేగంగా ఉన్నాడో ఇప్పుడు కూడా అలాగే ఉండడం కష్టమే. అయితే ఇప్పటికీ ధోనీ గొప్ప లీడర్, బ్యాటింగ్‌లో తన దూకుడు చూపించాడు. తనపరిస్థితిపై ఆతడికి ఒక అవగాహన ఉంటుంది. మైదానంలో చాలా కీలకమైన ఆటగాడు. అతడొక దిగ్గజ క్రికెటర్ కాదని ఎవరైనా చెప్పగలరా అని ఫ్లెమింగ్ ఎదురుప్రశ్నలువేసాడు.

## గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్

### గాయంతో కేన్‌విలియమ్సన్ దూరం



**అహ్మదాబాద్:** ఐపిఎల్ 2023 సీజన్ తొలిమ్యాచ్‌లోనే గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్‌కేన్ విలియమ్సన్ మోకాలిగాయం కారణంగా టోర్నీనుంచి వైదొలిగాడు. చెన్నై సూపర్‌కింగ్స్‌తోజరిగిన తొలిమ్యాచ్‌లో ఫీల్డింగ్‌చేస్తున్న సమయంలో కేన్ గాయపడ్డాడు. ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో రుతురాజ్ గైక్వాడ్ సిక్స్ కొట్టేందుకు యత్నించాడు. అమాంతం గాల్లోకి ఎగిరి క్యాచ్ అందుకునే యత్నంచేసిన విలియమ్సన్ బౌండరీ బయట పడిపోయాడు. కానీ ఈలోపే బంతిని మైదానంలోకి విసిరి రెండుపరుగులు సేవ్‌చేసాడు. కిందపడే సమయంలోకేన్ మోకాలు నేలకు బలంగా తాకింది. దీనితో విలియమ్సన్ నొప్పితో విలవిల్లాడాడు. సహాయకసిబ్బంది సాయంతో విలియమ్సన్ మైదానం వదిలి వెళ్లగా సాయిసుదర్శన్‌ను ఇంపాక్ట్‌ప్లేయర్‌గా బరిలోకి దించారు. విలియమ్సన్ బ్యాటింగ్‌కు రానిలోటు ఛేజింగ్‌లో స్పష్టంగా కనిపించింది. గాయపడిన విలియమ్సన్‌ను స్కానింగ్‌కోసం ఆసుపత్రికి తరలించాడు. కేన్‌కు మోకాలి గాయం అయిందన్న కెప్టెన్ పాండ్యా స్కానింగ్ రిపోర్టులు వైద్యులుపరిశీలించాకే స్పష్టత వస్తుందన్నాడు. కానీ ఆతడు ఐపిఎల్‌మొత్తానికి దూరం అవుతున్నట్లు తేలింది. ఐపిఎల్ వేలంలో టైటాన్స్ ఆతడిని రెండుకోట్ల ప్రాథమిక ధరకు కొనుగోలుచేసింది. 2015లో సన్‌రైజర్స్‌లో చేరిన కేన్‌విలియమ్సన్ గత సీజన్‌వరకూ ఆఫ్రాంచైజీ తరపునే ఆడాడు. గత సీజన్‌లో ఆటతీరు నిరాశపరిచింది. దీనితో ఆరెంజ్ ఆర్మీ ఆతడిని వేలానికి వదిలేసింది. ఆతడిస్థానం డేవిడ్ మిల్లర్‌తో భర్తీచేసే అవకాశం ఉంది. నెదర్లాండ్స్‌తో దక్షిణాఫ్రికా మ్యాచ్‌వల్ల ఐపిఎల్ తొలిమ్యాచ్‌లో మిల్లర్ ఆడలేకపోయాడు. తర్వాతమ్యాచ్‌లకు అందుబాటులోకి వస్తాడు.

# వాణిజ్యం

## మలేసియా ట్రేడింగ్‌లోనూ భారత్ రూపాయి!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** అంతర్జాతీయ వాణిజ్యంలో దేశీయ కరెన్సీ రూపాయికి ఆదరణ పెరుగుతోంది. భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూపాయల్లో చేయడానికి చాలా దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే రష్యా మారిషస్, శ్రీలంకలతో ఎగుమతి-దిగుమతి లావాదేవీలు రూపాయల్లో చేస్తుండగా, తాజాగా ఈ జాబితాలో మలేసియా కూడా చేరింది. ఇక భారత్, మలేసియా మధ్య ట్రేడ్ సెటిల్‌మెంట్‌లు ఇతర కరెన్సీలతో పాటు రూపాయాల్లోనూ జరుగుతాయని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ చెల్లింపులను రూపాయల్లో చేసేందుకు వీలుగా గతేడాది జులైలో ఆర్‌బిఐ అనుమతులిచ్చింది. అందుకు అనుగుణంగా ఇప్పుడు మలేసియాతో వాణిజ్యం ప్రస్తుతమున్న కరెన్సీలతో పాటు రూపాయాల్లోనూ జరగనుంది. ఇందుకోసం కౌలాలంపూర్‌లోని ఇండియా ఇంటర్నేషనల్ బ్యాంకు ఆఫ్ మలేసియా, భారత్‌లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో కలిసి ప్రత్యేక రూపీ వోస్ట్రో ఖాతాలను అందుబాటులోకి తెచ్చింది అని విదేశాంగ శాఖ వెల్లడించింది. దీంతో ఇరు దేశాల మధ్య ఇకపై ఎగుమతులు, దిగుమతుల ఇన్‌వాయిసింగ్, చెల్లింపులు, సెటిల్‌మెంట్ మన రూపాయాల్లోనూ జరగనున్నాయి. దేశీయ కరెన్సీలో క్రాస్-బోర్డర్ వాణిజ్య లావాదేవీలకు సంబంధించిన సవివర మార్గదర్శకాలను ఆర్‌బిఐ గతేడాది జులైలో జారీచేసిన విషయం విదితమే. రూపాయల్లో వాణిజ్య లావాదేవీల సెటిల్‌మెంట్ కోసం, భాగస్వామి వాణిజ్య దేశానికి చెందిన బ్యాంకుల్లో రూపీ వోస్ట్రో ఖాతాలతో ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తారు. దేశీయ దిగుమతిదార్లు ఈ వ్యవస్థ ద్వారా చేసుకునే దిగుమతుల కోసం, వోస్ట్రో ఖాతాలకు రూపాయల్లో చెల్లింపు చేస్తారు. ఎగుమతిదార్లు విదేశాలకు ఎగుమతి చేసిన వస్తువులు, సేవలకు కూడా ఈ వ్యవస్థలో వోస్ట్రో ఖాతాల నుంచి రూపాయల్లోనే నిధులు అందుకుంటారు.



## ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకులో వాట్సాప్ సేవలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ప్రైవేట్ టెలికం దిగ్గజం ఎయిర్‌టెల్‌తో కలిసి బ్యాంకింగ్ సేవలను ప్రారంభించింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు వినియోగదారులు స్మార్ట్‌ఫోన్‌లో వాట్సాప్ బ్యాంకింగ్ సేవలు పొందవచ్చు. పలు బ్యాంకు సర్వీసులతో పాటు ఇంటి వద్ద సేవల కోసం వినతి, సమీపంలోని పోస్ట్ ఆఫీస్ శాఖ ఎక్కడ ఉంది వంటివి వాట్సాప్ ద్వారా ఖాతాదారులు తెలుసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. భారత్‌లో డిజిటల్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌ను ప్రోత్సహించడానికి భారతీ ఎయిర్‌టెల్‌తో భాగస్వామ్యం కావడానికి సంతోషిస్తున్నామని ఇండియాపోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపిపిబి) సిజిఎం అండ్ సిఎస్ఎంఒ, గురుశరణ్ రాయ్ బన్సాల్ చెప్పారు. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగస్వామిగా దేశంలోని గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను అందించడానికి ఐపిపిబి చాలా కాలంగా అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. సాంతికతతో నడిచే ఆర్థిక రంగంలో అపారమైన అవకాశం ఉందని ఎయిర్ టెల్ ఐక్యూ బిజినెస్ హెడ్ అభిషేక్ బిస్వాల్ అన్నారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు అత్యుత్తమ ఆర్థిక ఉత్పత్తులను తీసుకెళ్తామని చెప్పారు. ఎయిర్‌టెల్ ఐక్యూ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు కస్టమర్లు బలమైన, సులభమైన, సురక్షిత క్లౌడ్ కమ్యూనికేషన్ అందిస్తుందని చెప్పారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకునకు 4.51 లక్షల పైచిలుకు కస్టమర్లు ఉన్నారు. లైఫ్ ఇంటెరాక్టివ్ కస్టమర్ సపోర్ట్‌ఏజెంట్‌ను కూడా వాట్సాప్‌లో పరిచయం చేయనున్నారు.




## మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు మరోసారి ఉద్వాసన

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** టెక్ కంపెనీల తొలగింపులు కొనసాగుతున్నాయి. ఆర్థిక సంక్షోభం కారణంగా చాలా ఐటి కంపెనీలు తమ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఎక్కువగా మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులను తొలగించింది. మైక్రోసాఫ్ట్ బెల్లేవ్, రెడ్‌మండ్‌లో 559 మంది ఉద్యోగులను తొలగించింది. దీనితో పాటు మైక్రోసాఫ్ట్ సీటెల్‌ప్రాంతంలో కంపెనీ నుంచి మొత్తం 2,743 ఉద్యోగులను తొలగించింది. ఈ యేడాది ప్రారంభంలో దిగ్గజ ఐటి కంపెనీలు చేసిన అతిపెద్ద ప్రకటనఇదే. ఇదిగతంలో తన కంపెనీలలో 10వేల మందిని పావు వంతు కంటే ఎక్కువ మందిని తొలగించింది. వాషింగ్టన్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ సెక్యూరిటీలో తాజా తొలగింపులు అధికారికంగా ప్రకటించబడ్డాయి. మైక్రోసాఫ్ట్ సెక్యూరిటీఆపరేషన్స్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఈ ఉద్యోగాల కోత విధించినట్లు ఒక నివేదిక నివేదించింది. ఫిబ్రవరిలో మైక్రోసాఫ్ట్ తన మొదటిరౌండ్ ఉద్యోగులనుతొలగించింది. ఇందులో రెడ్‌మండ్, బెల్లేవ్, ఇస్సాక్వాలో 617 మంది ఉద్యోగులను తొలగించినట్లు నివేదించింది. 2021లో మైక్రోసాఫ్ట్‌లో చేరిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ మాజీ ఎగ్జిక్యూటివ్ చార్లీ బెల్ ఆధ్వర్యంలో వందలాది మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలిపింది.

## రూ.5.86 లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సంపద ఆవిరి!



**ముంబై, ఏప్రిల్ 1:** అధిక ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ సమస్యలు, అధిక వడ్డీ రేట్ల వంటి ప్రతికూల పరిస్థితుల మధ్య 2022-23 ఆర్థిక సంవత్సరంలో స్టాక్‌మార్కెట్ల ఇన్వెస్టర్లు రూ.5.86 లక్షల కోట్లను కోల్పోయారు. మార్చి 31తో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడిదారులు అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అధిక వడ్డీరేట్లు, విదేశీ నిధులు వెనక్కి వెళ్లిపోవడం, ఇటీవల ప్రపంచ బ్యాంకింగ్ రంగం సంక్షోభం వంటి అంశాలు ఎక్కువ ఒత్తిడి కలిగించాయి. దాంతో గత ఆర్థిక సంవత్సరంలో బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.5.86 లక్షల కోట్లు తగ్గి రూ.258 లక్షల కోట్లకు పడిపోయింది. ద్రవ్యోల్బణం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక సెంట్రల్ బ్యాంకులు కీలక రేట్లను పెంచాయి. దాంతో పాటు మాంద్యం, ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై ఆందోళనతో మార్కెట్లను బలహీనపరిచాయని ట్రేడింగ్ వ్యవస్థాపకుడు పార్థ్‌న్యాతి అన్నారు. 2022-23లో బిఎస్ఇ సెన్సెక్స్ అంతకుముందు ఆర్థిక సంవత్సరం నుంచి 423.01 పాయింట్లు లేదా 0.72శాతం పెరిగింది. ముఖ్యంగా మార్చి 31తో ముగిసిన చివరి రోజు సెన్సెక్స్ 1,031,43 పాయింట్లు పెరగడం విశేషం. గతేడాది డిసెంబరు 14 ఇన్వెస్టర్ల సంపదగా భావించే బిఎస్ఇ మార్కెట్ విలువ రికార్డుస్థాయిలో రూ.291.25 లక్షల కోట్లను చేరింది. అలాగే 2022 జూన్ 17న సెన్సెక్స్ యేడాది కనిష్టం 50,921.22ని నమోదు చేసింది. అదేవిధంగా 2022 డిసెంబరు 1న ఆల్‌టైమ్ గరిష్టం 63,583.07కి చేరింది. రూ.15.77 లక్షల కోట్లతో రిలయన్స్ దేశంలోనే అత్యంత విలువైన సంస్థగా ఉంది. తర్వాత టిసిఎస్ రూ.11.73 లక్షల కోట్లు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రూ.8.98లక్షలకోట్లు, ఐసిఐసిఐబ్యాంకు 5.62 లక్షల కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్ రూ.6.01 లక్షల కోట్లతో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

## విదేశీ ఇన్వెస్టర్లలో బేరిష్ ధోరణులు




**ముంబై, ఏప్రిల్ 1:** విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత మార్కెట్ల పట్ల తీవ్ర బేరిష్ ధోరణిని ప్రదర్శిస్తున్నారు. దీనికి నిదర్శనంగా గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత నికర షార్ట్ పొజిషన్లను వారు కొనసాగిస్తున్నారు. యుఎస్ ఫెడ్ అదే పనిగా వడ్డీరేట్లు పెంచుతూ వెళుతుండడం, దీంతో అమెరికాలో బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం, పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, తాజాగా తోడైన అమెరికా బ్యాంకింగ్ సంక్షోభం, ఇవన్నీ కలిసి ప్రతికూల ధోరణిని బలోపేతం చేస్తున్నాయి. ఈ పరిణామాల ఫలితంగా విదేశీ ఇన్వెస్టర్లు కొన్ని నెలలుగా భారత మార్కెట్లపై ప్రతికూల వైఖరితోనే కొనసాగుతున్నారు. భారత ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు సాగిస్తూనే ఉన్నారు. అదే సమయంలో మన దేశీయ మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు, బీమా సంస్థలు, ఇతర ఇనిస్టిట్యూషన్స్, హెచ్ఎన్ఐలు కొనుగోళ్లు చేస్తుండడం మార్కెట్లు భారీగా పడిపోకుండా ఆదుకుంటోంది. నిఫ్టీ ఇండెక్స్ ఫ్యూచర్లలో ఎఫ్‌పిఐల ఓపెన్ షార్ట్ కాంట్రాక్టులు 2,16,000కు పెరిగాయి. కానీ గత ఐదేళ్లలో సగటున ఈ షార్ట్ కాంట్రాక్టులు లక్షగానే ఉండేవి. దాంతో పోలిస్తే రెట్టింపైనట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లలో నెట్‌షార్ట్ పొజిషన్లు 2,00,000 కాంట్రాక్టులను దాటిపోయింది. కేవలం 6శాతం ట్రేడింగ్ రోజుల్లోనే నమోదైంది. నికర షార్ట్ పొజిషన్లు పెరగడం అనేది సమీప కాలానికి మార్కెట్ల పట్ల ఎఫ్‌పిఐలు బేరిష్ వైఖరితో ఉన్నారని తెలియచేస్తోందని, ఇక్కడి నుంచి మార్కెట్లు పడిపోతాయనే అంచనాతో ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇండెక్స్ ఫ్యూచర్, ఆప్షన్లలో షార్ట్ చేసి, పడిపోయిన తర్వాత కొనుగోలు చేయడం వల్ల లాభాలు సమకూరతాయి.

## స్మాల్ సేవింగ్స్‌పై వడ్డీరేట్ల పెంపు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** కేంద్ర ప్రభుత్వం ప్రజలకు కొత్త 2023-24 ఆర్థిక సంవత్సరంలో గుడ్‌న్యూస్ అందించింది. చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను 70 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ పెంపు 2023, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వర్తిస్తుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, మంత్లీ ఇన్‌కమ్ సేవింగ్స్‌స్కీమ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్, కిసాన్ వికాస్‌పత్ర, అన్ని పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్లు, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై వడ్డీరేట్లు పెరిగాయి. గత 9 నెలల్లో చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను కేంద్రం పెంచడం ఇది మూడోసారి. ప్రస్తుతం వీటి వడ్డీరేట్లు 4శాతం నుంచి 8.2శాతం మధ్య ఉన్నాయి. అయితే పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతా, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌ల వడ్డీరేటులో ఎటువంటి మార్పు లేదు. అదే యేడాది పోస్ట్ ఆఫీస్ టైమ్ డిపాజిట్‌పై వడ్డీరేటును 6.6 శాతం నుంచి 6.8శాతానికి, 2యేళ్ల పోస్ట్ ఆఫీస్ టైమ్ డిపాజిట్‌పై వడ్డీని 6.8శాతం నుంచి 6.9శాతం శాతానికి పెంచారు. మూడేళ్లకు 7శాతం, ఐదేళ్లకు 7.5శాతం, 5యేళ్ల రికరింగ్ డిపాజిట్‌కు 6.2 శాతం, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌కు అధికంగా 8.2శాతం, మంత్లీ ఇన్‌కమ్ సేవింగ్స్ స్కీమ్‌కు 7.4శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్‌కు 7.7శాతం, కిసాన్ వికాస్ పత్రకు 7.5 శాతం, సుకన్య సమృద్ధి యోజన పథకానికి 8శాతం వడ్డీ అమలవుతుంది.




కాగా ప్రభుత్వం త్రైమాసిక ప్రాతిపదికన చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను సవరిస్తుందనే విషయం విదితమే.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.